

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అవుతుందని సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశమందిరంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

కొండలా రాయల్టీ బకాయిలు

ఏళ్ల తరబడి చెల్లించని క్వారీల నిర్వాహకులు

- యథావిధిగా రాయి తవ్వకాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- జిల్లాలో పేరుకుపోయిన రాయల్టీ, పన్ను బకాయిలు రూ.300 కోట్లు
- వసూలుకు చర్యలు చేపట్టని ప్రభుత్వం
- క్వారీల నిర్వాహకులతో కూటమి నేతలు లోపాయికారి ఒప్పందం



మార్టూరులో గతంలో జరిమానా విధించిన రాయి క్వారీ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో వున్నాసరే.. క్వారీల నిర్వాహకులు హవా సాగిస్తున్నారు. కొండలను తొలుస్తూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నప్పటికీ ప్రభుత్వానికి రాయల్టీ మాత్రం సరిగా చెల్లించడంలేదు. జిల్లాలో రోడ్డు మెటల్, కంకర క్వారీల నిర్వాహకులు సుమారు రూ.300 కోట్ల మేర ప్రభుత్వానికి రాయల్టీ, జరిమానాల రూపంలో బకాయి పడ్డారు.

జిల్లాలో అత్యధిక రాయి క్వారీలు అనకాపల్లి మండలంలో ఉన్నాయి. రాయి తవ్వకాలకు అనుమతి పొందిన వ్యక్తులు, సంస్థలు నిర్ణీత మొత్తాన్ని రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి చెల్లించాలి. అయితే రాయి క్వారీల నిర్వాహకులు కొన్నేళ్లుగా రాయల్టీ చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. జిల్లాల పునర్విభజనకు ముందు ప్రస్తుత అనకాపల్లి జిల్లా పరిధిలోని రాయి క్వారీల్లో 2020-21 సంవత్సరంలో అప్పటి గనుల శాఖ విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ ఏడీ ప్రతాపరెడ్డి విస్తృత తనిఖీలు చేపట్టారు. మార్టూరు, మామిడిపాలెం, మాకవరం, కుంచంగి, కూండ్రం, వేటజంగాలపాలెం పరిసరాల్లో పలు క్వారీలతోపాటు స్టోన్ క్రషర్లలో తనిఖీలు నిర్వహించి కొలతలు తీయించారు. నిబంధనలు ఉల్లంఘించిన క్వారీలు, స్టోన్ క్రషర్ల నిర్వాహకులకు సుమారు రూ.300 కోట్లకు పైచిలుకు రాయల్టీ, జరిమానాలు విధిస్తూ నోటీసులు జారీ చేశారు. కానీ ఎవరూ జరిమానాలు చెల్లించలేదు. నాడు అధికారంలో వున్న వైసీపీ పెద్దలను ఆశ్రయించడంతో రాయల్టీ, జరిమానాల చెల్లింపులు అటకెక్కాయి. కొన్ని క్వారీల నిర్వాహకులు మాత్రం మొక్కుబడిగా కొద్ది మొత్తాన్ని చెల్లించి యథావిధిగా మైనింగ్ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు అనకాపల్లి మండలం మార్టూరులో ఒక ప్రముఖ కంపెనీకి అప్పట్లో రూ.11 కోట్లకు పైగా రాయల్టీ చెల్లించాలని నోటీసులు జారీ చేయగా రూ.25 లక్షలు మాత్రమే చెల్లించినట్టు తెలిసింది. నర్సీపట్నం డివిజన్‌లోని రోలుగుంట మండలంలో ఒక క్వారీకి సుమారు రూ.7 కోట్లు రాయల్టీ విధించగాచ రూ.20 లక్షలు మాత్రమే చెల్లించి, వైసీపీకి చెందిన ఒక నాయకుడి అండతో క్వారీని నడిపించారు. అనకాపల్లి మండలంలోని పలు క్వారీల నిర్వాహకులు అప్పట్లో వైసీపీ నాయకులతో అంటకాగి రాయల్టీ చెల్లించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మారిన తరువాత కూడా రాయల్టీ, జరిమానాలను వసూలు చేయడంలో గనుల శాఖ అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వుంటున్నారో అర్థం కావడంలేదు. వాస్తవానికి రాయల్టీ, పన్నులు చెల్లించని క్వారీల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి లైసెన్స్‌లు రద్దు చేసే అవకాశం ఉంది. కానీ జిల్లాలో ఒక్క క్వారీపైనా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవనే చెప్పాలి.

ప్రభుత్వం మారినా...

రాష్ట్రంలో పది నెలల క్రితం ప్రభుత్వంతోపాటు గనుల శాఖలో అధికారులు మారారు. సాక్షాత్తూ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నారు. అయినప్పటికీ క్వారీల నిర్వాహకుల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ, పన్ను బకాయిల వసూళ్లపై దృష్టి సారించలేదు. ఏ క్వారీ నిర్వాహకులు ఎంత బకాయి వున్నారు? వాటిని చెల్లించేలా ఎటువంటి చర్యలు చేపట్టాలనే దానిపై ఏనాడూ చర్చించలేదు. గతంలో వైసీపీ నాయకుల ఆధీనంలో ఉన్న కొన్ని క్వారీలను, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా పార్టీల నాయకులు తమ ఆధీనంలోకి తీసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే రాయల్టీ, పన్ను బకాయిల వసూళ్లపై దృష్టి సారించడం లేదని తెలిసింది.

ఈదురు గాలులతో వర్షం

చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో భారీగా కురిసిన వాన

- మిగిలిన చోట్ల మోస్తరు జల్లులు
- రబీ పంటలకు ప్రయోజనం
- గాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం
- వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం



రోలుగుంటలో భారీ వర్షంతో జలమయమైన బీఎన్‌రోడ్డు

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్)

వాతావరణంలో నెలకొన్న అనిశ్చితి కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. మాడుగుల, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో ఈదురుగాలులతో భారీ వర్షం పడింది. పాయకరావుపేట, ఎలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాల్లో మోస్తరు వర్షం కురిసింది. మిగిలినచోట్ల ఆకాశం మేఘావృతమైందే తప్ప వర్షం పడలేదు. కాగా మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీక్షణంగా కాసింది. వేడి గాలులు సైతం వీచడంతో రహదారులపై జనసంచారం బాగా తగ్గిపోయింది. ఎండవేడి, ఉక్కపోతతో జనం ఇబ్బంది పడ్డారు. అయితే మధ్యాహ్నం రెండు గంటల తరువాత నుంచి వాతావరణం క్రమేపీ మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వీచాయి. కొద్దిసేపట్లోనే వర్షం మొదలైంది. ఇదే సమయంలో గాలులు వీచడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆయా మండలాల్లో అర్ధ గంట నుంచి గంటపాటు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం చెందారు. ఈ వర్షం అపరాలు, కూరగాయలు, నువ్వు, వేరుశనగ పంటలతోపాటు కార్శీ చెరకు, సరుగుడు తోటలకు ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.



మాడుగుల మండలం ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

రోలుగుంట మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలో బీఎన్ రోడ్డు వర్షం నీటితో పంట కాలువను తలపించింది. ప్రధాన రహదారి జలమయం అయ్యింది. ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడ్డారు. చోడవరం మండలంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. కె.కోటపాడు మండలంలోని పలు గ్రామాల్లో మధ్యాహ్నం సుమారు 40 నిమిషాలపాటు వర్షం కురిసింది. మాడుగుల మండలంలో ఈదురు గాలులతో గంటపాటు మోస్తరు వర్షం పడింది. గాలుల కారణంగా కొన్నిచోట్ల విద్యుత్ వైర్లు తెగిపోయి సరఫరా నిలిచిపోయింది. దేవరాపల్లి మండలంలో ఈదురు గాలులతో మోస్తరు వర్షం పడింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. చీడికాడ మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

పాయకరావుపేట మండలంలో ఈదురు గాలులతో మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ వేడి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు, వాతావరణం చల్లబడడంతో ఊరట చెందారు. నక్కపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం చిరుజల్లులు పడ్డాయి. ఎలమంచిలి పట్టణంలో మంగళవారం అర్ధగంటపాటు మోస్తరు వర్షం కురిసింది. సబ్బవరం మండలంలోని పలు గ్రామాల్లో అర్ధగంటపాటు గాలులతో వర్షం కురిసింది. కోటవురట్ల మండలంలో మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో మోస్తరు వర్షం పడింది.

చోడవరం సబ్‌రిజిస్ట్రార్ గీతాలక్ష్మి సాహసం

- హిమాలయాల్లోని దయారా బుగ్యాల్ శిఖరం అధిరోహణ



దయారా బుగ్యాల్ శిఖరంపై కుటుంబ సభ్యులతో సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి (ఎడమ వైపు)

చోడవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ బలగా గీతాలక్ష్మి హిమాలయాల్లో 11,830 అడుగుల ఎత్తులో ఉన్న దయరా బుగ్యాల్ శిఖరాన్ని అధిరోహించారు. ఈ నెల 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకు శిఖరం అధిరోహణ కార్యక్రమంలో పాల్గొని ఆమె తిరిగి వచ్చారు. పర్వతారోహణపై అభిరుచి ఉన్న ఈమె ఇప్పటికే తూర్పుకనుమల్లో 5,540 అడుగుల ఎత్తైన జిందగడ్ శిఖరంతోపాటు గత ఏడాది అక్టోబరులో హిమాలయాల్లో 12,110 అడుగుల ఎత్తైన చంద్రశిల శిఖరాన్ని అధిరోహించారు. ఈ సారి పర్వతారోహణలో ఆమెతో పాటు, భర్త, పిల్లలు కూడా పాల్గొనడం విశేషం.

కిరాతకం



అనూష, జ్ఞానేశ్వర్ (ఫైల్ ఫొటో)

- భార్యను, కడుపులో ఉన్న బిడ్డను చంపేసి, పక్కనున్న కుర్చీలో కూర్చుని సెల్ ఫోన్‌తో కాలక్షేపం
- నిండు గర్భిణి హత్య కేసులో నివ్వెర పరచిన నిందితుడి వ్యవహారం
- తొలి నుంచీ వదిలించుకునే యత్నం
- మొదట బ్లడ్ క్యాన్సర్ బారినపడినట్టు నాటకం
- ఆ తరువాత తన కుటుంబ సభ్యులు చంపేస్తారని బెదిరింపు
- అవన్నీ విఫలం కావడంతోనే హత్యకు తెగించిన వైనం - 8లో

ప్రజా సమస్యలే అజెండా

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం



- వేసవిలో తాగునీటి ఎద్దడిపై ప్రధానంగా చర్చ
- విద్య, వైద్యం, ఇరిగేషన్, వగైరా సమస్యలను ప్రస్తావించనున్న సభ్యులు

అనకాపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలు మౌలిక సదుపాయలకు సంబంధించి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వేసవి సమీపిస్తుండడంతో తాగునీటి ఎద్దడి పొంచివుంది. మే నెల నుంచి సమస్య మరింత తీవ్రతరం కానున్నది. మరో వైపు మండలాలకు కేటాయించిన జిల్లా పరిషత్ నిధులు ఖర్చు చేయకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జడ్పీ సర్వసభ్య సమావేశం జరగనుంది. టీడీపీ, జనసేన, వైసీపీలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరై తమ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రధానంగా వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చకుండా చేపట్టాల్సిన చర్యలపై సభ్యులు చర్చించనున్నారు. ఇంకా విద్య, వైద్యం, సాగునీటి వనరులు, పౌర సరఫరాలు, డ్వామా, డీఆర్‌డీఏ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వివిధ అంశాలు చర్చకు రానున్నట్టు తెలిసింది.**

గత కొద్ది రోజుల నుంచి ఎండలు మండిపోతుండడంతో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. దీంతో బోర్లు అడుగంటే ప్రమాదం వుంది. దీనివల్ల రక్షిత మంచినీటి పథకాలకు నీరు అందని పరిస్థితి ఏర్పడుతుంది. ఆర్థిక సంఘం, జడ్పీ సాధారణ నిధులతో కొత్తగా బోర్లు తవ్వించాలని గత ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదనలు చేశారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కొరవడడంతో మునగపాక, అనకాపల్లి, కశింకోటతోపాటు పలు మండలాల్లో బోర్లకు కేటాయించిన నిధులను వినియోగించలేదు. సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్ కింద గుర్తించిన తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపట్టలేదు. ఇంటింటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు కోసం జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తికాలేదు. ఈ విషయాన్ని సమావేశంలో సభ్యులు ప్రస్తావించనున్నారు.

అనకాపల్లి నుంచి మునగపాక మీదుగా అచ్యుతాపురం వరకు రోడ్డు విస్తరణ పనులు జరగనున్నాయి. స్థలాలు, ఇళ్లు, భూములు కోల్పోతున్న నిర్వాసితులు టీడీఆర్ బాండ్లు వద్దని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని అనకాపల్లి, మునగపాక, అచ్యుతాపురం మండలాల సభ్యులు సభలో అధికారులను డిమాండ్ చేయనున్నారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్ సక్రమంగా జరగకపోవడంతో దేవరాపల్లి మండలానికి చెందిన ఒక రైతు చెరకు తోటకు పంటకు నిప్పంటించి నిరసన తెలిపాడు. ఇంకా పాత బకాయిలు, ఇటీవల ముగిసిన సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు డబ్బులు చెల్లింపులు జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో చెరకు రైతుల సమస్యలపై జడ్పీ సమావేశంలో చర్చించే అవకాశం వుంది.

జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గుంతలు లేని రహదారుల పనులు పెద్దఎత్తున జరిగాయి. ఆయా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ఈ అంశాన్ని సభలో ప్రస్తావిస్తామని కొంతమంది సభ్యులు చెబుతున్నారు.

పరవాడలో పట్టపగలు చోరీ

- ఎనిమిది తులాల బంగారం, 25 తులాల వెండి అపహరణ



దొంగలు పగలగొట్టిన చెక్కపెట్టె

పరవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): **పరవాడలో తాళం వేసిన ఓ ఇంట్లో మంగళవారం పట్టపగలు చోరీ జరిగింది. ప్రధాన ద్వారం పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు ఎనిమిది తులాల బంగారు ఆభరణాలతోపాటు 25 తులాల వెండి పట్టీలు, కొంత నగదుతో ఉడాయించారు. ఇందుకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.**



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

పరవాడకు చెందిన లాలం రవణమ్మ స్థానిక మార్కెట్ సమీపంలో నివాసం వుంటున్నది. సినిమా హాల్ జంక్షన్‌లో టిఫిన్ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నది. రోజూ తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకు టిఫిన్ సెంటర్‌లో వుంటుంది. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం వ్యాపారం ముగించుకొని 10.30 గంటలకు ఇంటికి వచ్చింది. ప్రధాన ద్వారం తలుపు పగులగొట్టి ఉండడంతో ఆందోళన చెంది లోపలికి వెళ్లి చూడగా మంచం కింద భద్రపరిచిన చెక్కపెట్టె పగలగొట్టి వుంది. ఇందులో దాచుకున్న నాలుగున్నర తులాల బంగారం, 25 తులాల వెండి పట్టీలు, కొంత నగదు, దేవుడి పటం వెనుక ఉంచిన మూడున్నర తులాల బంగారం పుస్తెలతాడు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్టు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చింది. డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు వెళ్లి, బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. క్లూస్‌టీం వచ్చి పలుచోట్ల వేలిముద్రల ఆధారాలను సేకరించింది. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసంపూర్తి ఇళ్లకు ఆర్థిక సాయం

- 13,748 మంది లబ్ధిదారులకు రూ.70 కోట్లు
- జూన్‌లో 13,700 గృహప్రవేశాలు
- రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు



మీడియాతో మాట్లాడుతున్న బత్తుల తాతయ్యబాబు

చోడవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గతంలో పక్కా ఇళ్లు మంజూరై, వివిధ కారణాల వల్ల నిర్మాణ పనులు పూర్తిచేయలేకపోయిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సాయం అందిస్తున్నదని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు తెలిపారు. మంగళవారం వడ్డాది సమీపంలోని వీరవల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీ ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీటీజీలకు రూ.లక్ష చొప్పున ఇస్తున్నదని చెప్పారు. ఈ మేరకు జిల్లాలో 13,748 మందికి సుమారు రూ.70 కోట్లు అదనపు సాయంగా అందుతుందన్నారు. జూన్‌లో 13,700 ఇళ్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చైర్మన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, జూన్‌లో గృహ ప్రవేశాలు చేయించాలని సీఎం చంద్రబాబు నిర్దేశించారని ఆయన చెప్పారు. అదనపు సాయం కింద ... మిగతా 8వ పేజీలో

కొత్త డీలర్లకు రేషన్ డిపోలు

- ఆర్డీవో ఆయిషా ఆదేశాలు జారీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అచ్యుతాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ కారణాల వల్ల ఖాళీ అయిన రేషన్ దుకాణాలకు ఎంపికైన అభ్యర్థులకు షాపులు అప్పగించాలంటూ ఆర్‌డీఓ ఆయిషా ఆదేశాలు జారీచేశారు. 'కొత్త రేషన్ డిపోలను డీలర్లకు అప్పగించరా?' అన్న శీర్షికతో ఈనెల 12న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన 30 రేషన్ డిపోలతోపాటు వివిధ కారణాల వల్ల ఖాళీ అయిన 60 రేషన్ డిపోలకు డీలర్ల నియామకానికి గత ఏడాది డిసెంబరులో అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. అదే నెల 13 వరకు దరఖాస్తులు స్వీకరించి, 26న రాత పరీక్ష, 27న ఇంటర్వ్యూలు నిర్వహించారు. తరువాత ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా విడుదల చేశారు. వెంటనే ఒక్కొక్క అభ్యర్థి నుంచి పౌరసరఫరాల శాఖకు రూ.20 వేలు, డీలర్ పేరున రూ.1,000కు చలానాలు కూడా కట్టించుకున్నారు. డిపోల నిర్వహణకు సొంత భవనం ఉండాలి. ఒకవేళ అద్దె షాపు అయితే లీజు అగ్రిమెంటు కూడా తీసుకున్నారు. కాగా ... మిగతా 8వ పేజీలో

ఉదయం ఎండ... మధ్యాహ్నం వర్షం


కోటవురట్లలో వర్షం

పాయకరావుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట, ఎలమంచిలి నియోజకవర్గాల్లో మంగళవారం మధ్యాహ్నం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పాయకరావుపేట పట్టణంలో ఒక మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈదురు గాలులతో మోస్తరు వర్షం పడింది. దీంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

కోటవురట్లలో..

మండలంలో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గత రెండు వారాల నుంచి ఎండ వేడి, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. ఈ వర్షం సరుగుడు తోటలు, కూరగాయలు, చెరకు తదితర పంటలకు ఊపిరిపోయిందని రైతులు తెలిపారు. వరి, నువ్వు పంటలకు ఉపయోగకరంగా ఉంటుందని వారంటున్నారు.


పాయకరావుపేటలో వర్షం పడుతున్న దృశ్యం

నక్కపల్లిలో..

మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. గత కొన్ని రోజుల నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా వుంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉక్కపోత కూడా వుండడంతో ప్రజలు విలవిల్లాడారు. సాయంత్రం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది.

ఎలమంచిలిలో..

పట్టణంలో మంగళవారం సాయంత్రం అర్ధగంట పాటు మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి భానుడి ఎండ ప్రతాపానికి అల్లాడిన ప్రజలకు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు.

రాంబిల్లిలో.

మండలంలోని పలు గ్రామంలో మంగళవారం వర్షం కురిసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ తీవ్రంగా కాసింది. మధ్యాహ్నం మూడు గంటల తరువాత వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని అరగంట సేపు వర్షం పడింది. పంట భూములు దున్నుకొనేందుకు ఈ వర్షం సరిపోతుందని రైతులు తెలిపారు.

అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే విజయకుమార్


చోడమాంబిక అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలాపల్లి, చోడపల్లి గ్రామాలలో మంగళవారం జరుగుతున్న అమ్మవార్ల పండుగలకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ హాజరయ్యారు. చీమలాపల్లిలో పారిపిల్లి అమ్మవారికి ఆయన పూజలు చేశారు. చోడపల్లిలో జరిగిన చోడమాంబిక అమ్మ వారి పెద్ద పండుగకు హాజరై నైవేద్యాలను స్వీకరించారు. ఆలయం వద్ద అన్నసంతర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు కర్రి నాగేశ్వరరావు, కర్రి రమణ, మామిడి శివఅప్పారావు, వడిశల సన్యాసిరావు పాల్గొన్నారు.

వ్యర్థాల దహనంతో వాహన చోదకుల ఇబ్బందులు


సత్యవరం-పెదరాంభద్రపురం రోడ్డులో వ్యర్థాలను దహనం చేసిన దృశ్యం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం తాండవ బ్రిడ్జి సమీపంలో రాత్రి సమయాలలో వ్యర్థాలను వేసి దహనం చేస్తుండడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి సత్యవరం నుంచి పెదరాంభద్రపురం వెళ్లే రోడ్డులో కాలువ పక్కన ట్రాక్టరుతో వ్యర్థాలను తీసుకు వచ్చి వాటిని దహనం చేసినట్టు వాహన చోదకులు చెబుతున్నారు. విపరీతమైన పొగ రావడమే కాకుండా వాసన రావడంతో రసాయన వ్యర్థాలు అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పరిసర ప్రాంతం అంతా పొగ, వాసన వ్యాపించడంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం కూడా వ్యర్థాలు మండుతూ పొగ వస్తుండడంతో రైతులు, పెదరాంభద్రపురం, సత్యవరం గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్


ఎలమంచిలిలో మాక్ డ్రిల్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎలమంచిలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తంగా ఉండి అగ్ని ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని ఎలమంచిలి అగ్నిమాపక శాఖ అధికారి రాంబాబు సూచించారు. మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, వ్యాపార సముదాయాల వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో ఆందోళన చెందకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా బస్టాండ్, కూరగాయల మార్కెట్, వ్యాపార సముదాయాలు వద్ద అగ్ని ప్రమాదాలు నివారణపై అనుసరించాల్సిన జాగ్రత్తలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే పారిశుధ్యం మెరుగు


చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ గంగ అప్పలనాయుడు

మునగపాక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే పారిశుధ్యం మెరుగు పడుతుందని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు అన్నారు. మంగళవారం మూలపేటలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలకు అనుగుణంగా ప్రతి ఒక్కరికి రెండు బుట్టలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మొల్లేటి దేవిచంద్ర, కార్యదర్శి మొల్లేటి గంగాధర్, వార్డు సభ్యులు ఆడారి సత్యనారాయణ, అమ్మాజి, మొల్లేటి గోవిందరావు పాల్గొన్నారు.

వెంకటాపురానికి సుస్తీ

- వారం రోజుల నుంచి జ్వరాలు, ఒంటినొప్పులతో గ్రామస్థుల అవస్థలు
- హోం మంత్రి అనిత ఆదేశాలతో గ్రామంలో వైద్య శిబిరం
- సాధారణ సమస్యలే : డాక్టర్ వాసంతి

ఎస్.రాయవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామస్థులు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారం రోజుల నుంచి జ్వరాలతోపాటు కాళ్లు, చేతులు పట్టేయడం, నొప్పులతో పలువురు గ్రామస్థులు కదల్లేక మంచానికే పరిమితమయ్యారు. సర్వసిద్ధి పీహెచ్‌సీలో వైద్యం చేయించుకున్నప్పటికీ నొప్పులు తగ్గడం లేదు. రోజురోజుకు స్థానికులు తీవ్ర అనారోగ్యానికి గురవుతుండడంతో అదే గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం ఈ విషయాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో మంగళవారం గ్రామంలో సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యులు ఎస్.వాసంతి గ్రామస్థులకు పరీక్షలు జరిపారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ రమేష్‌బాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ ఆ గ్రామానికి వెళ్లి గ్రామసర్పంచ్, గ్రామస్థులను ఆరా తీశారు. అలాగే తాగునీటి సరఫరా గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారంతా గ్రామంలో మంచానికి పరిమితమై కదల్లేని స్థితిలో ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి పరిశీలించి, వారి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే డాక్టర్ వాసంతి సమక్షంలో సిబ్బంది వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త నమూనాలను సేకరించారు. గ్రామంలో 80 మంది వరకూ ప్రజలు జ్వరాలు, శరీర భాగాల నొప్పులతో బాధపడుతున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు అబద్ధం తెలిపారు. వైద్య శిబిరంలో 99 మంది రోగులు పాల్గొనగా.. అందులో 67 మంది జాయింట్ నొప్పులతో బాధపడుతున్నారు. గ్రామంలో మరో రెండు రోజులు పాటు విద్య శిబిరం కొనసాగిస్తామని వైద్య సిబ్బంది చెప్పారు.


రోగుల ఇళ్ల వద్ద చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు అబద్ధం, డాక్టర్ వాసంతి


వైద్య శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

పరీక్షలు చేసినా రిపోర్టుల్లో సమస్య లేదు..

ఎన్ వాసంతి, డాక్టర్, సర్వసిద్ధి పీహెచ్‌సీ

వెంకటాపురంలో ప్రజలు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలియడంతో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశాం. రోగులు సాధారణంగా వయసు పైబడి ఎప్పుడూ నొప్పులతో బాధపడుతున్నారు. అంతే తప్పితే సమస్య ఏమీ లేదు. ఇదివరకు సీహెచ్‌సీకి వచ్చిన రోగులకు రక్త పరీక్షలు నిర్వహించినప్పటికీ ఈ రిపోర్టుల్లో కూడా ఎటువంటి సమస్యలు లేవు.

భక్తులకు ఉచిత ఆటో ప్రయాణం, మజ్జిగ పంపిణీ


ఉచిత ఆటోను ప్రారంభిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి): చోడపల్లి చోడమాంబిక అమ్మవారి పండుగకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం స్థానిక శివశక్తి ఆటో యూనియన్ అసోసియేషన్ సభ్యులు ఉచిత ఆటో ప్రయాణాన్ని కల్పించారు. గుడికి వెళ్లే భక్తులకు అచ్యుతాపురం జంక్షన్ నుంచి చోడపల్లి ఆలయం వరకూ పది ఆటోలను ఏర్పాటు చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము ఉచిత ఆటో ప్రయాణాన్ని ప్రారంభించారు. భక్తులకు ఉచితంగా మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కూండ్రపు సోమునాయుడు, ఆటో యూనియన్ నాయకులు దమ్ము చండి, పోలవరపు అప్పారావు, తట్ట రాజు, ధర్మిరెడ్డి సన్నిబాబు, పోలారపు దుర్గ, మురళి, సూరిబాబు పాల్గొన్నారు.

హాట్ కేకుల్లా సముద్రం చేపలు విక్రయం

- ఎగబడిన మాంసాహారులు.. రెండు నెలలు వేట నిషేధమే కారణం.. జోరుగా సాగిన అమ్మకాలు


ఉపమాక సంతలో సముద్ర చేపలను కొంటున్న వినియోగదారులు

నక్కపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):మార్కెట్లు, వారపు సంతల్లో సముద్రం చేపలు మంగళవారం హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. మంగళవారం నుంచి సముద్రంలో వేటను ప్రభుత్వం నిషేధించడంతో సముద్రం చేపల విక్రయాలు జోరందుకున్నాయి. వాటిని కొనుగోలు చేసేందుకు మాంసాహారులు ఎగబడ్డారు. మరో రెండు నెలల పాటు సముద్రం చేపలు దొరకవనే ఉద్దేశంతో కొనుగోలు చేశామని పలువురు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పాయకరావుపేట నియోజకవర్గంలో మత్స్యకార గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని 18 మత్స్యకార గ్రామాలున్నాయి. జిల్లాలో రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లో కూడా తీరప్రాంతం వుంది. ఈ మండలాల్లో దాదాపు 85 వేల వరకూ మత్స్యకారులున్నారు. దాదాపు 20 వేల మందికి పైగా సముద్రంలో చేపల వేట ప్రధాన వృత్తిగా ఆధారపడి జీవిస్తున్నారు. ఏప్రిల్ 15 నుంచి సముద్రంలో చేపల వేటను మత్స్యశాఖ నిషేధించింది. జూన్ 15వ తేదీ వరకూ ఈ నిషేధం అమలులో ఉంటుంది. మత్స్యసంపద, ముఖ్యంగా రొయ్యలు పిల్లలను ఉత్పత్తి చేసే సీజన్‌గా భావించి ఈ రెండు నెలలను వేట నిషేధంగా పరిగణించారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ వేటాడిన మత్స్యసంపదను మంగళవారం నియోజకవర్గంలోని పలు మార్కెట్లు, వారపు సంతల్లో విక్రయించారు. మరో రెండు నెలల వరకూ సముద్ర చేపలు దొరకవనే భావనతో మంగళవారం పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి పరిసర ప్రాంతాల్లో సముద్ర చేపలను కొనుగోలు చేసేందుకు మాంసాహారులు ఎగబడ్డారు. దీంతో చేపల అమ్మకాలు జోరుగా సాగాయనే చెప్పాలి.

ఉపాధి కూలీలకు సిల్వర్ బేసిన్‌లు పంపిణీ


ఉపాధి కూలీలకు బేసిన్‌లు అందజేసిన నర్సింగరావు

మునగపాక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాడ్రాపల్లిలో 280 మంది ఉపాధి కూలీలకు తెలుగురైతు జిల్లా కార్యదర్శి మళ్ల వరహా నర్సింగరావు సిల్వర్ బేసిన్‌లను అందజేశారు. గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల పార్టీల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, మళ్ల శేషు, గుబ్బల సత్యనారాయణ, తురాయి మోహన్, కొయిలాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి: ఎమ్మెల్యే సుందరపు


అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో మండలాన్ని అభివృద్ధి చేయడానికి అధికారులంతా కృషిచేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే స్వగృహంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం భవిష్యత్తు అనకాపల్లి జిల్లాకు తలమానికంగా మారబోతోందన్నారు. అందువల్ల అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. విద్య, వైద్యం, విద్యుత్, రహదారులు అన్ని రంగాల్లో అచ్యుతాపురం ముందుండాలన్నారు. ఎక్కడ ఏసమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈసమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ సంగీత పోటీల్లో గిన్నిస్ రికార్డు సాధించిన 'పేట' యువకుడు

పాయకరావుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటకు చెందిన ఆలపు నూకరాజు (విజయ్) ప్రపంచస్థాయి క్రిస్టియన్ సంగీత పోటీల్లో అద్భుత ప్రతిభ కనబర్చి గిన్నిస్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకున్నాడు. మంగళవారం ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. ఉన్నత విద్యను అభ్యసించి సోషల్ యాక్టవిస్టుగా పనిచేస్తున్న తనకు చిన్నతనం నుంచి సంగీతం అంటే మక్కువని, యేసుక్రీస్తును సంగీత కార్యక్రమాల్లో పాల్గొనేవాడినని తెలిపారు. ఈక్రమంలో గతేడాది డిసెంబరు 1న ప్రపంచ స్థాయిలో జరిగిన ఆన్‌లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో తాను పాల్గొని గంటపాటు కీబోర్డ్ వాయిస్తూ పాట పాడుతూ 1,046 వీడియోలు అప్‌లోడ్ చేసినందుకు గిన్నిస్ వరల్డ్ రికార్డు దక్కిందన్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హాలెల్ మ్యూజిక్ స్కూల్ నిర్వాహకుల చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డు మెడల్, ప్రశంసాపత్రం అందుకున్నట్టు నూకరాజు తెలిపారు.


గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన ఆలపు నూకరాజు

వెన్నునొప్పి బాధితుడికి రూ.3.32 లక్షల ఆర్థిక సాయం

- మానవత్వం చాటుకున్న డేంజర్ గైస్ యువకులు

మునగపాక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చెట్టుపై నుంచి పడి వెన్నునొప్పితో మంచానికే పరిమితమైన గీత కార్మికునికి డేంజర్ గైస్ యువకులు భరోసాగా నిలిచారు. నక్కపల్లి మండలం చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన గీత కార్మికుడు దుంగల శ్రీను కొద్ది రోజులు క్రితం చెట్టుపై నుంచి పడడంతో వెన్నెపూసకు దెబ్బతగిలి మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయాన్ని వాట్సాప్, ఫేస్‌బుక్‌ల ద్వారా మునగపాక గ్రామానికి చెందిన డేంజర్ గైస్ యువకులు తెలుసుకున్నారు. కొంత మంది యువకులు వాస్తవం తెలుసుకునేందుకు చినదొడ్డుగల్లు వెళ్లారు. ఆపరేషన్‌కు రూ.ఐదారు లక్షలు అవుతుందన్న విషయాన్ని తెలుసుకున్న యువకులు రూ.3.32లక్షలను శ్రీను భార్య భవానీకి మంగళవారం అందజేశారు.


భవానికి నగదు అందజేస్తున్న డేంజర్ గైస్ ప్రతినిధులు, యువకులు

మినరల్ వాటర్ అందించడం అభినందనీయం

- బీజేపీ నాయకుడు బద్దెం సూర్యనారాయణ

మునగపాక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మినరల్ వాటర్‌ను పదేళ్లుగా ఉచితంగా అందివ్వడం సాధారణ విషయం కాదని బీజేపీ సీనియర్ నాయకుడు బద్దెం సూర్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలో జరిగిన మినరల్ వాటర్ ప్లాంట్ పదో వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా రూ.లక్షల్లో ఖర్చు చేసి ప్రజలకు ఉచితంగా తాగునీరు అందజేసిన ప్రసాద్‌కు అభినందనలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ వ్యవస్థాపకుడు బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఆడారి గణపతి అచ్చింనాయుడు, ఆడారి కాశిబాబు, వార్డు సభ్యులు, యువజన మందిర అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

మూడో రోజు రథయాత్రకు విశేష స్పందన

మునగపాక, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ రక్ష రథయాత్ర మూడో రోజుకు చేరుకుంది. మంగళవారం తోటాడ పంచాయతీలో రథయాత్రకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. అడుగడుగునా హారతిలిచ్చారు. రథానికి ప్రజాప్రతినిధులు, నాయకులు స్వాగతం పలుకుతున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పొలమరశెట్టి మురళి, విశాఖ డెయిరీ జోనల్ మేనేజర్ శరగడం రమణ, సివిల్ ఇంజనీర్ వెలగా సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలు తెలుసుకోకుండా విమర్శలా..

- టీడీపీ నేతలు లాలం కాశీనాయుడు, జానకి శ్రీనివాసరావు


విలేకర్లతో మాట్లాడుతున్న లాలం కాశీనాయుడు, జానకి శ్రీనివాసరావు

కోటవురట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విధానాలు తెలియకుండా వైసీపీ నాయకులు విమర్శలు చేయడం మానుకోవాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ కైలాసపట్నంలో పేలుడు ఘటన జరిగి రెండు గంటలు కాకుండానే మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ నష్టపరిహారాన్ని డిమాండ్ చేయడాన్ని వారు తప్పుబట్టారు. ప్రమాదం జరిగిన వెంటనే మంత్రి అనిత, స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించి, జిల్లా అధికారులను అప్రమత్తం చేసి, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించారన్నారు. వైసీపీ నాయకులు బాధిత కుటుంబాలను కలిసి సానుభూతి తెలియడం మంచిదే కాని గంటల వ్యవధిలోని నష్టపరిహారంపై ధర్మశ్రీ వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ విధానాలు తెలుసుకోకుండా విమర్శలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పెట్ల లింగంనాయుడు, రాజుపేట సర్పంచ్ వెంకటరమణ, కోటవురట్ల ఎంపీటీసీ సభ్యుడు పి.సూర్యారావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించండి

- మునిసిపల్ కమిషనర్‌కు టీడీపీ నేతల వినతి


కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న టీడీపీ నేతలు

ఎలమంచిలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వర్గీయ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజుకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణంలో పీవీ కాంప్లెక్సు వద్ద ఉన్న స్థలాన్ని ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు కేటాయించాని కోరినట్టు టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి ఆడారి రమణబాబు, జిల్లా ప్రతినిధి కొఠారు సాంబ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లోవాంబిక జాతర



రాంబిల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం గ్రామంలో మంగళవారం లోవాంబిక అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు,కుంకుమలను నివేదించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కొందరు మొక్కుబడులు తీర్చారు. అమ్మవారిని దర్శించేందుకు భక్తులు బారులు తీరారు. గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నూకాంబిక అమ్మవారికి వెండి ఆభరణం వితరణ

ఎస్.రాయవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటసూదిపురం నూకాంబిక అమ్మవారికి అదే గ్రామానికి చెందిన నానబోయిన నాగేష్, సత్యవతి, వారి కుమారులు గణేష్, రమేష్ రూ.75 వేలతో వెండి ఆభరణాన్ని తయారు చేయించారు. నూతన వెండి ఆభరణాన్ని మంగళవారం నాగేష్, సత్యవతి దంపతులు గ్రామ పెద్దల సమక్షంలో నూకాంబిక అమ్మవారికి అలంకరించారు.

ఘనంగా అమ్మవార్ల పండుగలు

కోటవురట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరు గ్రామాల్లో గ్రామదేవతల పండుగలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని నీలిగుంట, రామచంద్రపాలెం, పందూరు, టి.జగ్గంపేట, అన్నవరం, చౌడువాడల్లో అమ్మవార్ల పండుగల సందర్భంగా భక్తులు పూజలు చేశారు. పందూరు ఇందేశమ్మ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, గ్రామ సర్పంచ్ జగదీష్, మాజీ సర్పంచ్ నారాయణరావు పూజలు చేశారు.



బాణసంచా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బాణసంచా కేంద్రంలో తహసీల్దార్ తనిఖీలు

మాకవరపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమబోయిన పాలెం గ్రామంలో బాణసంచా కేంద్రంలో తహసీల్దార్ లోకవరపు రామారావు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కేంద్రానికి అనుమతులు ఉన్నాయా? లేదా? నిబంధనల ప్రకారం సిబ్బంది ఎంత మంది పనిచేస్తున్నారు? మందుగుండు సామగ్రి ఎంత మోతాదులో తయారు చేస్తున్నారన్న వివరాలపై ఆరా తీశారు. అన్నీ నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని ఈ సందర్భంగా తహసీల్దార్ తెలిపారు. తూటిపాల గ్రామంలో మరోకేంద్రం మూతపడి ఉందన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కొండల అగ్రహారం రేషన్ డిపోల్లో విచారణ



కొండలఅగ్రహారం రేషన్ డిపోలో విచారణ చేపడుతున్న ఆర్ఐ

మాకవరపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండలఅగ్రహారం రేషన్ డిపోల్లో ఆర్ఐ జట్టి మంగళవారం విచారణ చేపట్టారు. మూడు నెలలుగా రెండు రేషన్ డిపోల్లో సుమారు 150 మంది లబ్ధిదారులకు బియ్యం ఇవ్వడం లేదని తహసీల్దార్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు విచారణ చేపట్టగా బియ్యం అరకొరగా వస్తున్నాయని, గోదాము నుంచి బియ్యం సక్రమంగా అందడం చేయలేదని డీలర్లు తెలిపారు. దీంతో ప్రతి నెలా 150 మందికి బియ్యం పంపిణీ చేయలేకపోతున్నామని, అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఇవ్వడం లేదని వారు చెప్పారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆర్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోతో పాటు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

గన్నవరంలో ఇరు వర్గాల కొట్లాట

నాతవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నవరం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సోమవారం రాత్రి వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య కొట్లాట జరిగింది. గన్నవరం, బుచ్చింపేట తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి అంబేడ్కర్ ఫొటో ఊరేగిస్తూ నృత్యాలు చేశారు. గన్నవరంలో వైసీపీ, టీడీపీ వర్గీల మధ్య వాగ్వాదం జరిగి కొట్లాటకు దారి తీసింది. దీంతో ఇరు వర్గాల వారు గాయపడ్డారని సమాచారం. పోలీసులకు మంగళవారం దండా దుర్గప్రసాద్, బొడ్డు కుటుంబీకులు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. కాగా, మంగళవారం ఉదయం నాతవరం పోలీసు స్టేషన్‌కు వైసీపీ, టీడీపీ వర్గీయులు తరలివచ్చారు. పోలీసులు రెండు వర్గాల వారిని కూర్చొబెట్టి ఎవ్వరిది తప్పు అన్న విషయంపై విచారణ చేశారు.

కొత్తవీధిలో తాగునీటి వెతలు

కాలువల నిర్మాణంలో పగిలిన పైపులైన్లు

25 రోజులుగా కుళాయిల నీరు బంద్

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

250 కుటుంబాల ప్రజల పడరాని పాట్లు

మాకవరపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మాకవరపాలెంలోని కొత్తవీధిలో ప్రజలు తాగునీటికి పడరాని పాట్లు పడుతున్నారు. సుమారు 250 కుటుంబాల వారు నివసిస్తున్న ఈ గ్రామంలో 25 రోజులుగా కుళాయిల నీరు బంద్ కావడంతో బిందెడు నీటికి బండెడు కష్టాలు ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి పేరిట మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలో తాగునీటి పైపులైన్లు పూర్తిగా పగిలిపోయాయి. కాలువ నిర్మాణం చేపట్టిన అధికారులు, కాంట్రాక్టర్ తాగునీటి కుళాయిల పైపులైన్లు వేయకుండా వదలివేశారు. దీంతో 25 రోజులుగా కుళాయిత నుంచి తాగునీరు సరఫరా కావడం లేదు.



కొత్తవీధిలో వృథాగా ఉన్న కుళాయి పైపులైన్లు

అయినప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు కనీసం పట్టించుకునే పాపానికి పోవడం లేదని గ్రామస్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో బిందెడు తాగునీటి కోసం అనేక కష్టాలు పడుతున్నామని, గత్యంతర లేక పక్క వీధుల్లో నుంచి నీరు తెచ్చుకుంటున్నామని మహిళలు వాపోయారు. అసలే వేసవి కారణంగా ఎండలు మండుతున్న తరుణంలో బిందెడు తాగునీరు కూడా లభించకపోతే ఎలా అని మండిపడుతున్నారు. ఈ సమస్యపై ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

తాగునీటి కోసం వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన

రావికమతం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రావికమతం మండలం అజయపురం గ్రామంలో గిరిజన మహిళలు వాటర్ ట్యాంకు ఎక్కి ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. 30 కుటుంబాలు నివసిస్తున్న అజయపురంలో 2019లో రూ.15లక్షలు ఖర్చు చేసి కిలోమీటరు దూరంలో బోరు తీసి పైపులైను ద్వారా గ్రామానికి నీటి సరఫరా చేసేవారు. ఇటీవల మోటారు కాలిపోవడంతో తాగునీటి కోసం ఎత్తైన కొండ గెడ్డపై ఊట బావిని ఏర్పాటు చేసుకుని నీరు తెచ్చుకుంటున్నారు. 2023లో జల్‌జీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేయడంతో తాగునీటి ట్యాంకు నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో అప్పటి నుంచి అవస్థలు పడుతున్నారు. గత ఏడాది డిసెంబరులో గ్రామానికి వచ్చిన ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ పరిష్కారం కాలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలిపోయిన మోటారుకు మరమ్మతులు చేపట్టి తాగునీటిని సరఫరా చేయాలని వారు కోరుతున్నారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు కె.గోవిందరావు, గిరిజనులు పాంగి జస్వంతి, శ్రీరామ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



అజయపురంలో వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలుపుతున్న గిరిజన మహిళలు

గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గొలుగొండ సర్పంచ్ అప్పారావు

గొలుగొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజలు సహకరించాలని గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో పలు అభివృద్ధి పనులపై చర్చించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధికి కృషి చేస్తామని పాలకవర్గం ఆమోదించింది. గ్రామంలో అన్ని విధాలా అభివృద్ధికి ప్రజలు, గ్రామస్థాయి అధికారులకు పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణ, బీజేపీ నాయకుడు శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కె. లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడి

» జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు

తుమ్మపాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు పేర్కొన్నారు. నువ్వు పంటలో క్షేత్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం దిబ్బపాలెంలో రైతులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నువ్వు పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులను కచ్చితంగా పాటించాలన్నారు. తొలకరి కాలంలో అన్ని రకాల ధాన్యాలు , పప్పుగింజలు, నూనె గింజలు కలిపి రైతులు చల్లుకోవాలని, తద్వారా నేలకు పోషకాలు అందుతాయని చెప్పారు. దిబ్బపాలెం, వెంకుపాలెం గ్రామాలను నూనె గింజ పంటల ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసినట్టు ఆయన చెప్పారు. ఈ గ్రామాల్లో 152 మంది రైతులకు నువ్వు గింజలు అందజేశామని చెప్పారు. అలాగే పంట కోత ప్రయోగాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజా, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి తులసీమణి, రైతులు పాల్గొన్నారు.



పంట కోత ప్రయోగాలు వివరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

అర్హులందరికీ ఉపాధి పనులు

మాకవరపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి చెప్పారు. మండలంలోని మామిడిపాలెం గ్రామంలో మంగళవారం ఉపాధి పనులను పరిశీలించారు. మూడు రోజులుగా గ్రామంలో కొందరికే పనులు కల్పిస్తున్నారని కూలీలు ప్రచారం చేయడంతో కూలీలతో ఆమె సమావేశమయ్యారు. అర్హులందరూ పనులు చేసుకోవచ్చని చెప్పారు. అలాగే వ్యవసాయ భూముల్లో గొయ్యిలు తవ్వుకోవాలని, దీనివల్ల నీటి నిల్వలు ఉండి పంటలకు ఉపయోగమని ఆమె సూచించారు. జాబ్ కార్డులు ఉండి పనులు కావాల్సిన తమను సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కాశీ, వీఆర్పీ పాల్గొన్నారు.

ఐదుగురు మందుబాబులపై కేసుల నమోదు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజలను విసిగించిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. సోమవారం రాత్రి నిర్వహించిన దాడుల్లో వీరు పట్టుబడ్డారన్నారు. నర్సీపట్నం ఏజెఎఫ్‌సీఎం కోర్టులో వీరిని హాజరుపర్చగా, ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారని ఆయన చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం తాగి వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.

ఈదురుగాలులతో వర్షం

గొలుగొండ/కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండల కేంద్రంతో పాటు కృష్ణాదేవిపేట, చోద్యం, నాగాపురం, కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట, జోగంపేట, పాతమల్లంపేట, పాకలపాడు, చీడిగుమ్మల, పప్పుశెట్టిపాలెం, కొత్తమల్లంపేట తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం పడింది. ఉదయం నుంచి ఎండతో అల్లాడిన ప్రజలకు వాతావరణం ఒక్కసారిగా చల్లబడి జల్లులు పడడంతో ఊరట చెందారు. అయితే గంటలు తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వర్షం మెరక దుక్కులకు ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లాలంకొత్తూరు గ్రామంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. కె.సత్యనారాయణ సంచిలో 20 మద్యం సీసాలు లభ్యమయ్యాయని చెప్పారు. ఈ మేరకు ఆయనను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

జాతీయ స్థాయి చిత్ర లేఖనం పోటీలకు దేవరాపల్లి విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయి చిత్ర లేఖనం పోటీలకు ఎంపికైన విద్యార్థులు

దేవరాపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయవాడలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచి నాలుగు బంగారు పతకాలు సాధించినట్టు ప్రధానోపాధ్యాయుడు బి. పడాల్‌దాస్ మంగళవారం తెలిపారు. ఈనెల ఐదున విజయవాడ డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్స్ అకాడమీ, అటవీ శాఖ సంయుక్తంగా నిర్వహించిన 12వ జాతీయ చిత్ర లేఖనం పోటీల్లో 24 మంది పాల్గొనగా.. అందులో జీ.జీవన్ (8వతరగతి), జి.జశ్వంత్ (9వ తరగతి), జి.కావ్య(7వ తరగతి), ఎం.సింహాద్రి(ఏడో తరగతి) బంగారు పతకాలు సాధించారు. సాయి సృజన, వై.చంద్రకాంత్, వై.జయవర్ధన్ కాంస్య పతకాలు సాధించారు. వీరికి తర్ఫీదు ఇచ్చిన వై.సముద్రం, ఎల్.సత్యనారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐజాక్, డి.శ్రీనివాసరావు, పీడీ బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు నిర్మాణానికి భూమిపూజ

దేవరాపల్లి, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లిలో తాగునీటి బోరు నిర్మాణానికి ఎంపీపీ బుల్లిలక్ష్మి మంగళవారం భూమిపూజ చేశారు. పెద్దన్నవారి కళ్లాలు, బుగిడి వారి కళ్లాల వద్ద ఆర్థిక సంఘ నిధులతో బోరు వేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, లక్కరాజు పెద్దినాయుడు, రాము, జగన్నాథం పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు తక్షణమే చెల్లించాలి

రోలుగుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పది వారాలుగా ఉపాధి కూలి బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే చెల్లించాలని కోరుతూ మంగళవారం కొంతలంలో ఉపాధి కూలీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకులు బాలరాజు మాట్లాడుతూ గత పది వారాలుగా పనిచేస్తున్నా ఉపాధి కూలి పడలేదన్నారు. ప్రతీ వారం చెల్లించాలని కోరారు. అలాగే ఉపాధి పనిదినాలు 200కు పెంచాలని కోరారు. పనిప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

19న మండల సమావేశం

మాడుగుల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 19వ తేదీన ఉదయం పదిన్నర గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

'సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు పొందండి'

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపాకలో 50 శాతం సబ్సిడీతో పవర్ వెడర్‌ను విస్సారపు కన్నయ్యకు గ్రామసర్పంచ్ గొలజాన శ్రీను, టీడీపీ నాయకుడు కలిమి శ్రీను అందజేశారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ నాని మాట్లాడు తూ, రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో కూడిన అనేక పరికరాలు, పనిముట్లు, బ్యాటరీ, పెట్రోల్ స్ప్రేయర్లు అందజేస్తున్నదన్నారు. ఈ అవకాశాన్ని రైతులంతా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



రైతుకు పవర్ వెడర్‌ను అందజేస్తున్న దృశ్యం

పలు ప్రాంతాల్లో భారీ వర్షం



చీడికాడలో కురుస్తున్న వర్షం



రోలుగుంటలో భారీ వర్షంతో జలమయం అయిన బీఎన్‌రోడ్డు

కె.కోటపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం గంటసేపు భారీ వర్షం కురిసింది. ఎండల తీవ్రతతో అల్లాడిపోయిన ప్రజలు చల్లటి గాలులతో వర్షం కురియడంతో ఉపశమనం పొందారు. ఈ వర్షం పంటలకు ఎంతో మేలు చేకూరుతుందని రైతులు అంటున్నారు.

రోలుగుంటలో..

రోలుగుంటలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా కాసింది. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో వాతావరణం మారి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఈ భారీ వర్షంతో మండల కేంద్రంలో బీఎన్ రోడ్డు పూర్తిగా జలమయం అయ్యింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం అపరాల పంటలకు కొంతమేర ఉపయోగం ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చీడికాడలో..

మండలంలోని అన్ని గ్రామాల్లో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల వరకూ మండుతున్న ఎండలతో ఇబ్బంది పడిన జనానికి ఈ వర్షంతో ఊరట చెందారు. ఈ వర్షం వ్యవసాయానికి ఎంతో ఉపయోగమని పలువురు రైతులు తెలిపారు.

మాడుగుల రూరల్‌లో..

మండలంలో మంగళవారం ఈదురుగాలులతో వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండతీవ్రంగా కాసింది. ఆ తర్వాత ఆకాశంలో మబ్బులు కమ్ముకొని ఈదురు గాలులతో గంట సేపు మెరుపులు, ఉరుములతో వర్షం పడింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఈదురు గాలులకు పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

మాడుగులలో..

మాడుగులలో మంగళవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రత పెరిగిపోవడంతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. గత రెండు మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు చెంది ఉరుములు, మెరుపులు, గాలి తప్ప వర్షం పడలేదు. దీంతో మధ్యాహ్నం కురిసిన వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు.

దేవరాపల్లిలో..

మండలంలో మంగళవారం మోస్తరు వర్షం పడింది. ఉదయం అంతా ఎండ కాయగా.. సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈవర్షం కూరగాయల పంటలకు, వేసవి దుక్కులకు అనుకూలంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

చోడవరంలో..

వాతావరణంలో మార్పుల ప్రభావంతో మంగళవారం సాయంత్రం మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ తీవ్రంగా కాసిన ఎండతో అల్లాడిపోయిన స్థానికులు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు.

బుచ్చెయ్యపేటలో..

బుచ్చెయ్యపేట వడ్డాది, వీఆర్‌ఆర్‌పేట, రాజాం, సీతయ్యపేట గ్రామాలలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వడ్డాది జంక్షన్ నుంచి చోడవరం పోయే రహదారిలో గొయ్యిలు పూర్తిగా జలమయమై ద్విచక్రవాహనదార్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షం వ్యవసాయానికి ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఒకరి పేరుపై మరొకరు ఉపాధి పనులకు రాకూడదు: ఏపీవో

రోలుగుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమరవోలు చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ ఈశ్వరరావు మంగళవారం తనిఖీ చేశారు. ఉపాధి హామీ పనుల్లో బోగస్ మస్టర్లు వేస్తున్నారని, సక్రమంగా కూలీల హాజరును నమోదు చేయలేదని, పనుల్లో పర్యవేక్షణ కరువైందని గ్రామానికి చెందిన కొంతమంది ఫిర్యాదు చేయడంతో ఆయన తనిఖీ చేశారు. సోమవారం హాజరైన కూలీల వివరాలను తనిఖీ చేశారు. ఒకరి పేరు మీద మరొకరు పనులకు రావడాన్ని గుర్తించారు. కొంతమంది కూలీలు పనులకు రాకపోయినా వారి మీద ఫారం పాండ్స్ పనులు జరుగుతున్నందున మస్టర్లు వేస్తున్నట్టు ఫీల్డ్ అసిస్టెంట్ తెలపడంపై మండిపడ్డారు. ఏపీఓకు తెలియపర్చకుండా ఇతర పనులు కల్పించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి ఎక్కడ పనులు జరిగితే అక్కడే కూలీలు పనిచేయాలన్నారు. అలాగే ఎవరికి జాబ్ కార్డు ఉంటే వారే పనుల్లోకి వచ్చేలా చూడాలని, లేదంటే వచ్చే వారం నుంచి మళ్లీ తనిఖీ చేసి చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అనంతరం ఉపాధి మేట్‌లతో సమావేశమయ్యారు. పని ప్రదేశాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, జాబ్ కార్డు ఉన్నవారే పనులకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఏ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో ఈశ్వరరావు

85 మందికి కంటి పరీక్షలు

చీడికాడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జైతవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 85 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యుడు పైల ముత్యాలనాయుడు, ఉపసర్పంచ్ ఈర్లె చైతన్య, మాజీ సర్పంచులు కోడూరు బంగారమ్మ, కోడూరు నారాయణమూర్తి ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్ సాయి, అంజలీకుమారి 85మందికి తనిఖీలు చేయగా, వీరిలో 20 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. ఈ శిబిరంలో మంచాల మోడల్‌స్కూల్ మాజీ చైర్మన్ కురచా రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రాజు




ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ద్వారకానగర్‌లో మంగళవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పాల్గొన్నారు. ఈ విందులో మండలంలోని గోవాడ, బుచ్చెయ్యపేట మండలాల్లోని వడ్డాది, మాడుగుల మండలంలోని కేజేపురానికి చెందిన ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు ముస్లింలకు అరబిక్ పాఠశాలకు స్థలాన్ని సమకూరుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి నాయకులు గేదెల సత్యనారాయణ, సిరిపురపు రమేష్, సకురు కోటేశ్వరరావు, పంచాయతీ వార్డు సభ్యుడు తానవరపు శ్రీనివాసరావు, నాయకులు ద్వారపురెడ్డి శ్రీనివాస్, బాలిబోయిన దేముళ్లు హాజరయ్యారు. ఇఫ్తార్ విందు నిర్వాహకులు మున్నూరు సాహెబ్, యాకబ్, కాజా సాహెబ్, లాలూబాయ్, మీరా. జాకీర్‌భాయ్, హుస్సేన్, మదీనా, మోతి తదితరులు పాల్గొన్నారు.

17న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

చోడవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భవిత కేంద్రాలు, పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఈనెల 17న స్థానిక బాలికల హైస్కూల్‌లో ఉపకరణాల పంపిణీ చేస్తామని జిల్లా సమగ్ర శిక్షా సమన్వయకర్త డాక్టర్ జయప్రకాశ్ మంగళవారం తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేల చేతుల మీదుగా దివ్యాంగులకు ఉపకరణాలు అందచేయనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి దివ్యాంగబాలలు హాజరుకావాలని ఆయన కోరారు.

ఉపాధి హామీ ఏపీఓగా రుక్మిణీ దేవి బాధ్యతలు



దేవరాపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం మండల ఏపీఓగా వై.రుక్మిణీ దేవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఏపీఓ సూర్యకళ చోడవరం బదిలీ కాగా, అక్కడ నుంచి ఇక్కడ బదిలీపై వచ్చి రుక్మిణీ దేవి బాధ్యతలు చేపట్టారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇస్తామన్నారు.

కంటి ఆపరేషన్లకు 17 మంది గుర్తింపు

దేవరాపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 17 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్టు వైద్యాధికారి పూజిత మేఘన తెలిపారు. విశాఖ రీజినల్ కంటి హాస్పటల్, స్థానిక కంటి వైద్య నిపుణులు కె.భవాని పరీక్షలు చేశారు. ఆపరేషన్లు అవసరమైన వారిని విశాఖపట్నం తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆనంద్, పుష్పరాజు పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేస్తే మరిన్ని పదవులు : బూడి

చీడికాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పటిష్ఠతకు కష్టపడి పనిచేస్తే భవిష్యత్తులో మరిన్ని పదవులు వరిస్తాయని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలో ఖండివరం గ్రామానికి చెందిన సుంకరి శ్రీనివాసరావును ఇటీవల పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా ఎంపిక చేయడంతో అయన్ని మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీకోసం అన్నివిధాలా కష్టపడి పనిచేయాలని, నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ముందుకుసాగాలని ఆదేశించారు.



రావణాపల్లి కూడలిలో గతంలో ఉన్న బస్‌షెల్టర్ (ఫైల్‌ఫొటో)



రావణాపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న బస్‌షెల్టర్



లుబ్బుర్తి జంక్షన్‌లో ప్రస్తుతం రేకులతో నిర్మించిన బస్‌షెల్టర్

గాలివీస్తే ఎగిరిపోయేలా బస్ షెల్టర్లు!

- జాతీయ రహదారి నిర్మాణంలో షెల్టర్లు తొలగింపు
- మూడేళ్ల తర్వాత నాసిరకం షెడ్ల నిర్మాణాలు
- రహదారులకు దూరంగా ఏర్పాటు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ▸ ప్రయాణికులకు అవస్థలు

కొయ్యూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బస్‌షెల్టర్లు తొలగించి.. వాటి స్థానంలో రేకులతో తాత్కాలికంగా షెడ్లు నిర్మించడంపై సర్వత్రా విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రహదారి నిర్మాణ కాంట్రాక్టరు తూతూ మంత్రంగా వీటిని నిర్మించి చేతులుదులుపుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ప్రయాణికులు నీడ కరవుతోంది. మండలంలో పలు గ్రామాల మీదుగా వెళుతున్న జాతీయ రహదారి 516ఈ నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో తొలగించిన శాశ్వత బస్ షెల్టర్ల స్థానంలో నూతనంగా షెడ్లులాంటి వాటిని నిర్మిస్తున్నారు. కాకరపాడు, పిట్టచలం, నడింపాలెం, లొద్దిపాకలు, రేవడివీధి కూడలి రావణాపల్లి, తోటలూరు, వైఎన్‌పాకలు కూడలి, వలసంపేట, గాదిగుమ్మి, రామరాజుపాలెం, పి.మాకవరం, నల్లగొండ, నడింపాలెం, కాట్రగెడ్డ తదితర గ్రామాల వద్ద ప్రయాణికులు సేదతీరేందుకు వీలుగా గతంలో ఉన్న బస్సు షెల్టర్లు రోడ్డు విస్తరణలో భాగంగా వీటిని సమూలంగా తొలగించారు. గత మూడేళ్లుగా బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణి కులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.వేసవిలో మండటెండలో ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.గ్రామాల్లో అయితే, పక్కన ఏదో ఒక ఇంటి వద్దనో లేదా దుకాణాల వద్ద ఆశ్రయం పొందవచ్చు. కానీ, రేవడివీధి, వైఎన్‌పాకలు కూడలి, లుబ్బుర్తి కూడలి తదితర రహదారికి దూరంగా ఉన్న కూడళ్లలో ప్రయాణీకులు నిలువ నీడ లేకుండా పోయింది. ప్రస్తుతం జాతీయ రహదారి నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. దీంతో బస్ షెల్టర్ల నిర్మాణాలపై సంబంధిత కాం ట్రాక్టరు చర్యలు చేపట్టారు. అయితే, అప్పట్లో తొలగించిన చోట్ల షెల్టర్లు నిర్మించకపోగా రోడ్డుకు అనుకుని ఉన్న గ్రామాల వద్ద గ్రామానికి సంబంధం లేకుండా వీటినిఏర్పాటు చేస్తున్నారు. ఇనుప పైపులు ఏర్పాటు చేసి చుట్టూ మూడోవంతు రేకులు వేసి షెల్టరు నిర్మించి చూపి చేతులు దులుపుకుంటున్నారు.

నిబంధన మేరకు జాతీయ రహదారి నిర్మాణానికి అనువుగా స్థలాల సేకరణ చేసిన సమయంలో ప్రజోపయోగమైన గుడులు, బడులు, బస్‌షెల్టర్లు తొలగించినా, వాటి స్థానంలో భవనా లు నిర్మించాల్సి బాధ్యత సంబంధిత కాంట్రాక్టరుపై ఉంది. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి నిర్మాణాలకు వీలుగా రహదారి విస్తరణలో భాగంగా అప్పట్లో ఉన్న బస్‌షెల్టర్లు ఏ విధమైన ఆకృతి కలిగి ఉన్నాయి. ఎన్ని షెల్టర్లు తొలగించారో..వాటికి అనుగుణంగా నిర్మాణా లు చేపట్టాలి. కానీ ప్రస్తుతం బస్‌షెల్టర్లు ఈదురు గా లులు వీస్తే.. రేకులు ఎగిరి పోయివాటికి వినియోగించిన పైపులు వంగిపోయేలా ఉన్నాయి. ఈ షెల్టర్లు నిర్మాణాలపై సంబంధిత జాతీయ రహదారి నిర్మాణ పర్యవేక్షణ అధికారులు దృష్టి సారించి గతంలో మాదిరి (తొలగించిన వాటి నమూనా, నాణ్యత)నూతన షెల్టర్లు నిర్మాణాలు జరిపించేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

ఇంటర్ ఫలితాల్లో గిరిజన విద్యార్థికి రాష్ట్రస్థాయి గుర్తింపు



రాష్ట్ర విద్యాశాఖా మంత్రి లోకేశ్‌నుంచి పురస్కారం అందుకుంటున్న కిరణ్, పక్కన తల్లిదండ్రులు

కొయ్యూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలపేట పంచాయతీ మర్రిపాలెంనకు చెందిన గిరిజన విద్యార్థి రావుల జర్మియా మౌళి కిరణ్ ఇంటర్ ఒకేషనల్ (బీఅండ్ఆర్‌ఎం) గ్రూప్‌లో 978 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. మూడు రోజుల కిందట విడుదలైన ఫలితాల్లో ఈ ఘనత సాధించారు. ఈ నేపథ్యంలో మంగళవారం అమరావతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. కిరణ్ నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివారు. ఈ సందర్భంగా విద్యార్థి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మరింత పట్టుదలతో డిగ్రీలో చేరి, సివిల్స్‌కు ప్రిపేరవుతానని తెలిపారు. తల్లితండ్రులకు మరింత గుర్తింపు తెస్తానని అన్నాడు. కిరణ్ తల్లి మూలపేట సర్పంచ్, తండ్రి ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

జీసీసీలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

- దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొర్రా మార్క్‌రాజు



మార్క్‌రాజు

సీలేరు, ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్రంగా అల్లూరి జిల్లాలో ఉన్న వివిధ గిరిజన సహకార సంస్థల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొర్రా మార్క్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పేరుకే గిరిజన సహకార సంస్థకానీ.. పెత్తనమంతా గిరిజనేతరులదే అని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో ప్రకటించనున్న ఉద్యోగుల పదోన్నతుల విషయంలో జీసీసీలో పనిచేస్తున్న ఓ వ్యక్తి ముడుపుల వ్యవహారం రహస్యంగా సాగిస్తున్నారన్నారు. ఒకరి వద్ద నుంచి రూ.5 లక్షల వరకు తీసుకుని అర్హత లేని వారికి అందలం ఎక్కించడానికి అధికారులు ప్ర యత్నిస్తున్నారన్నారు. ఈ వివరాలను త్వరలోనే బయటపెడతామని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో సీనియర్లను పక్కన పెట్టి జూనియర్లకు ఎఫ్ఏసీ మేనేజర్లుగా బాధ్యతలను అప్పగిస్తున్నట్టు పేర్కొన్నారు. మరికొంతమంది ఉద్యోగులు రెండుచోట్ల ఉద్యోగాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే, గతంలో అనేక అక్రమాలకు పాల్పడి సస్పెండైన ఉద్యోగికి ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. తక్షణమే జీసీసీ ఎండీ, చైర్మన్ స్పందించి కింది స్థాయిలో జరుగుతు న్న ఈ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో దోషులను అన్ని ఆధాలతో ప్రజాక్షేత్రంలో నిలిపి న్యాయపోరాటంచేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో నాయకులు కాంతారావు, బాలకృష్ణ, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం



ఆందోళన చేస్తున్న కాఫీ కార్మికులు

చింతపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కారంలో ఏపీఎఫ్‌డీసీ అధికారులు విఫలమయ్యారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాఫీ కార్మికులతో కలిసి ఏపీఎఫ్‌డీసీ అధికారు వైఖరికి నిరసనగా ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది నవంబరు 4తేదీన కాఫీ కార్మికులు, ఏపీఎఫ్‌డీసీ అధికారులకు మధ్య చర్చలు జరిగాయన్నారు. యాజమాన్యం పది డిమాండ్లను పరిష్కరించేందుకు హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు పెంచిన రూ.1500 వేతనం మాత్రమే అమలుచేస్తున్నారన్నారు. ఇతర డిమాండ్లలో ఒక్కటీ పరిష్కరించలేదన్నారు. తక్షణమే ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షురాలు కనకవల్లి, నాయకులు మోరి గిరి, వెంకటేశ్, కాంతారావు, రాజారావు, నాగేశ్, పాపారావు పాల్గొన్నారు.

రాళ్లగెడ్డ గిరిజనులకు కలుషిత నీరే దిక్కు



ఊట కుండీలో నీటిని బకెట్లతో తోడుతున్న మహిళలు

సీలేరు, ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ రాళ్లగెడ్డ గ్రామంలో తాగునీటి స మస్య నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో గ్రామానికి జల్‌జీవన్ మిషన్ పథకం మంజూరైనా పనులు పూర్తి చేయలేదు. గ్రామంలో బోర్లు కూడా పని చేయడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో తాగునీటి కోసం ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో ఐదు కిలోమీటర్ల దూరంగా ఉన్న చిన్నపాటి ఊట ట్యాంకు నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఆ ఊట కుండీ కూడా కలుషితంకావడంతో అందులోని నీటితో బకెట్లతో తోడుకోవాల్సి వస్తోందన్నారు. ఈనీటినే శుభ్రం చేసుకుని ఇళ్లలోని అవసరాలకు గ్రామానికి తెచ్చుకుంటున్నారు. కూటమి నాయకులు స్పందించి తమ గ్రామానికి మంచినీటి సౌకర్యాన్ని కల్పించేలా చర్యలు చేపట్టాలని గిరిజన మహిళలు అభ్యర్థిస్తున్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన కేజీబీవీ విద్యార్థినులు

- జిల్లాలోని మిగిలిన విద్యాలయాల కంటే మెరుగైన ఉత్తీర్ణత



కిలగాడ కేజీబీవీ విద్యాలయం

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిలగాడ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినులు ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. జిల్లా వ్యాప్తంగా 19 కేజీబీవీలుండగా బోర్డు ప్రకటించిన ఫలితాల్లో కిలగాడవిద్యాలయం మొదటి స్థానంలో నిలిచింది. ఈ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 36 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా ఒక్కరు మినహా మిగిలిన వారంతా ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంత్సరంలో 37 మందికి గాను శతం ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉబ్బేటి సాయిప్రసన్న మంగళవారం మాట్లాడారు. ఇం టర్‌లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల, ఏకాగ్రతగా చదువుపై దృష్టి సారించడంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆమె అభినందనందించారు.

ముత్యాలమ్మ జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు



సీఐ వినోద్ కుమార్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి బాలరాజు

చింతపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలమ్మ జాతరలో భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు, ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు అన్నారు. మంగళవారం ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఆయన సీఐ ఎం. వినోద్‌బాబు, ఎస్ఐ వెంకట రమణతో ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈనెల 24నుంచి 27 వరకు జరగనున్న జాతరలో అమ్మవారిని దర్శించుకునేందుకు గిరిజన ప్రాంతాలతోపాటూ మైదాన ప్రాంతాలు, పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో వస్తారన్నారు. జాతర నాలుగు రోజులు భక్తులకు మె రుగైన సదుపాయాలు కల్పించాలన్నారు. భక్తుల కోసం రక్షిత మంచి నీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను కోరారు. శానిటేషన్ పనులు చేపట్టేందుకు అదనపు సిబ్బందిని నియమించాలన్నారు. నీటి సమస్య తలెత్తకుండగా ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండగా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు గ్రామస్థులంతా కమిటీకి పూర్తి సహకారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పసుపులేటి వినాయకరావు, అర్గనైజింగ్ కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ప్రమాదం



గోపవరం సమీపంలో విద్యుత్ వైర్లతో రేగుతున్న మంటలు (ఫైల్)

కొయ్యూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) జీడిమామిడి తోట కొమ్మలకు విద్యుత్ తీగలకు తగలటంతో మంటలు చెలరేగి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మండలంలో డౌనూరు నుంచి గోపవరం వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డుకు ఆనుకుని జీడిమామిడి తోటల మధ్య నుంచి విద్యుత్ లైన్ ఉంది. దీనికి సంబంధించి వైర్లు చెట్టు కొమ్మలకు తగలటంతో మంటలు చెలరేగుతున్నాయి. విద్యుత్ తీగలు ఎత్తు పెంచటమో... లేదా చెట్ల కొమ్మలుతీగలకు తగలకుండా కత్తిరించే చర్యలు చేపట్టాల్సి ఉంది. లేకుంటే జీడిమామిడి పిక్కలు సేకరణకు వెళ్లే వారు.. మేతకు వచ్చే పశువులు విద్యుదాఘాతానికి లోనయ్యే ప్రమాదం ఉంది. ఈ ఫీడర్ లో విధులునిర్వహించే సంబంధిత శాఖ సిబ్బంది తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రంపచోడవరంలో కుస్తీ పోటీలు రేపు

పాడేరురూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ వారు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ నెల 17వ తేదీ శనివారం రంపచోడవరం డివిజన్ ఇర్రాపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల్లో అండర్ 14, 17 విభాగంలో బాలికలకు కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికారిక అధికారి ఎ.జగన్మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల కుస్తీ క్రీడాకారులు తమ పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో ఆరోజు ఉదయం 7.30 గంటలకు క్రీడా పోటీల ప్రాంగణానికి హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు ఎం.రత్నరాజు, రెజ్లింగ్ కోచ్ ఫోన్: 9000 904610, 90002 74225 కు సంప్రదించాలని కోరారు.

35 ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు చర్యలు

- ఏపీఎస్ఐడీసీ విజయనగరం డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీరు త్రిమూర్తులు



కిండంగి ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న ఇంజనీరు త్రిమూర్తులు

పాడేరురూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా పరిధిలో నిరుపయోగంగా ఉన్న 35 ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి అందించనున్నట్టు ఏపీఎస్ఐడీసీ విజయనగరం డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీరు వి.త్రిమూర్తులు తెలిపారు. ఏజెన్సీలో ఎత్తిపోతల పథకాలను పరిశీలించేందుకు మంగళవారం ఆయన పాడేరు వచ్చారు. మండలంలోని కిండంగి పంచాయతీ కేంద్రంలో ఎత్తిపోతల పథకాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కిండంగి పంచాయతీ సేరిబయలు ఎత్తిపోతల పథకం స్కీం 1, 2లను సందర్శించారు. మరమ్మతులకు గురై ప్రస్తుతం మూలకు చేరిన ఈ పథకాల మరమ్మతులకు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి సమర్పించనున్నామన్నారు. గతంలో సేరుబయలు స్కీంకు మరమ్మతులు చేపట్టినా పూర్తి స్థాయిలోకి అందుబాటులోకి రాలేదన్నారు. నిధులు మంజూరైన వెంటనే టెండర్లకు పిలిచి మరమ్మతులు పూర్తి చేసి ఆయకట్టు రైతులకు లబ్ధిచేకూర్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచులు కూడా శ్రీలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, పెసాకమిటీ ఉపాధ్యక్షుడు శరభ యువరాజు, కార్యదర్శి భూపాల్, టీడీపీ నాయకులు డుంబేరి విశ్వనాథం, కూడా నూకరాజు, కిండంగి, సేరుబయలు రైతులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు మోదకొండమ్మ ఆలయం ముస్తాబు



ఆలయ గోపురానికి రంగులు వేస్తున్న దృశ్యం

పాడేరు ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మన్యం వాసుల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు మే 11,12,13 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో ఆలయానికి ముస్తాబు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయానికి కొత్తగా రంగులు వేస్తున్నారు. ప్రస్తుతం ఆలయ మండపం, గోపురానికి రంగులు వసే పనిలో కళాకారులు బిజీగా ఉన్నారు. మరో పది రోజుల్లో మొత్తం రంగుల పనులు పూర్తి చేసేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎగువశోభ



విజేత జట్టుకు నగదు బహుమతి అందిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు, ఎంపీపీ

అనంతగిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన క్రీడాకారులను ప్రోత్సహిస్తే రాణిస్తారని స్థానిక ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ దీసరి గంగరాజు అన్నారు. మండల కేంద్రం పరిధి పెదూరు గ్రామంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌ను జడ్పీటీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు.. ఫైనల్స్‌లో ఎగువశోభ, పెదబిడ్డ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఎగువశోభ జట్టు పది ఓవర్లలో 100 పరుగులు చేసింది.. అనంతరం బ్యాటింగ్ చేసిన పెదబిడ్డ జట్టు 60 పరుగులకే ఆలౌటైంది. విజేతగా నిలిచిన ఎగువశోభ జట్టుకు రూ.20 వేలతో పాటు ట్రోఫీ, రన్నర్‌గా జట్టు పెదబిడ్డకు రూ.10 వేలు, ట్రోఫీని అందించారు. ఈ కార్యక్రమంలో సర్పం చులు రూతు, మోస్య, వైసీపీ నాయకుడు సూర్యానారాయణ, నాగులు, దేవన్న, మల్లేశ్వరరావు, రాంబాబు, మంజుల, కళావతి, దేముడమ్మ పాల్గొన్నారు.

1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి



నిరసన ర్యాలీ చేపడుతున్న పెసా కమిటీ నాయకులు

జి.మాడుగుల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 1/70 భూ బదలాయింపు చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని మండల పెసా కమిటీ ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పెసా కమిటీ నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలో అక్రమ కట్టడాలను నివారించాలని, బినామీ నివారణ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న అటవీ భూములను సాగు పట్టాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 17 పంచాయతీల పెసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ



దోరగుడలో ఇళ్ల పరిసరాల్లో దోమల మందు పిచికారీ చేస్తున్న వైద్యా సిబ్బంది

డుంబ్రిగుడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గుంటసీమ పంచాయతీ దోరగుడ గ్రామంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు ఆధ్వర్యంలో దోమల నివారణ మందు పిచికారీని మంగళవారం ప్రారంభించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి కెళ్లి అల్ఫా సైపర్ మిథైన్ మందుతో స్ప్రే చేశారు. దశాల వారీగా పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాలకు ఈ మందు చల్లిస్తామని వైద్యాధికారి రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామారావు. ఆరోగ్య సహాయకుడు రవీంద్ర, ఏఎన్‌ఎం సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో కొనసాగుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

- పాడేరులో 38.1 డిగ్రీల నమోదు

పాడేరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మన్యంలో గత వారం రోజులుగా ఏదో ప్రాంతంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో పాడేరులో మంగళవారం 38.1 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కొయ్యూరులో 35.3, డుంబ్రిగుడలో 34.3, పెదబయలు, అరకులోయలో 32.9, హుకుంపేటలో 32.0, జీకేవీధిలో 31.3, చింతపల్లిలో 30.8, జి.మాడుగుల 30.3, అనంతగిరిలో 29.8 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరురూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులకు మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌ను అందించనున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారి ఎం.నర్సింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న మెగా డీఎస్సీకి ఈ ఆన్‌లైన్ శిక్షణకు టెట్ అర్హత సాధించిన, ఆ=సక్తి అభ్యర్థులు మాత్రమే వారివారి సొంత జిల్లాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వీరు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు టెట్ పరీక్ష అర్హత పత్రం జతపరచాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత వెనుబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారి కార్యాలయం అల్లూరి జిల్లా పాడేరులో సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్లు: 8106999039, 9441293675 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు ముంచంగిపుట్టులో సదరం క్యాంప్

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టులో ఈ నెల 16వ తేదీ బుధవారం సదరం క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్టు స్థానిక ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తి తెలిపారు. ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు సంబంధించి ఈ శిబిరం ఏర్పాటుచేసినట్టు వివరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్న ఈ క్యాంపునకు వచ్చే దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్ కార్డులు విధిగా తీసుకురావాలని సూచించారు. వారికి అవసరం మేరకు ఉచితంగా పరికరాలను అందిస్తామన్నారు. వీరికి మధ్యాహ్నా భోజన సదుపాయం కల్పిస్తామన్నారు.

19న చింతపల్లిలో ఉపకరణాల పంపిణీ

గూడెంకొత్తవీధి: చింతపల్లి సబ్ డివిజన్ కేంద్రంలో ఈనెల 19న దివ్యాంగులు, వృద్ధులకు ప్రభుత్వం పరంగా ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్టు స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు వీరిని ఆరోజు చింతపల్లి తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే, ప్రతి ఒకరికీ ఆధార్ కార్డు ఉండాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సున్న నుంచి ఆరు ఏళ్ల వయస్సు కలిగిన బాలబాలికలకు ఆధార్ కేంద్రానికి తీసుకువచ్చి నమోదు చేయించాలన్నారు. మండలంలో లక్కవరపుపేట, సంకాడ, రింతాడ-2, ధారకొండ, సీలేరులో ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆధార్ కార్డు నమోదుకు జనన ధ్రువీకరణ పత్రం తీసుకు వెళ్లాలని సూచించారు.

స్కేటింగ్ కోర్టు ప్రాంగణం.. అధ్వానం!

జీవీఎంసీ అధికారుల ఎడతెగని నిర్లక్ష్యం.. కనీస పర్యవేక్షణ లేకపోవడం.. సమస్య తెలిసినా పట్టించుకోకపోవడం.. వెరసి స్కేటింగ్ కోర్టు దుర్భరంగా మారింది. ఫలితంగా చిన్నారులకు వినోదం కరువవుతోంది. సదుపాయాల లేమితో తల్లిదండ్రులూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సరికదా! అసాంఘిక కార్యకలాపాలకు నిలయమవుతోంది!



స్కేటింగ్ కోర్టు ఆవరణలో మూలకు చేరిన గేటు

సిమెంట్ బెంచీలు ధ్వంసం

- గేట్ లేని ద్వారం.. పర్యవేక్షణ శూన్యం
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం
- జీవీఎంసీ అధికారుల ఎడతెగని నిర్లక్ష్యం
- చిన్నారులకు అందని వినోదం
- లక్ష్మీనారాయణనగర్ స్కేటింగ్ కోర్టు పరిస్థితి దయనీయం



కోర్టు ఆవరణలో దెబ్బతిన్న సిమెంట్ బెంచీలు



గేటు లేని స్కేటింగ్ కోర్టు ద్వారం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనారాయణనగర్ స్కేటింగ్ కోర్టు ప్రాంగణం పరిస్థితి దయనీయంగా తయారైంది. సాయంత్రం సమయాల్లో పిల్లలతో స్కేటింగ్ కోర్టుకు వచ్చే తల్లిదండ్రులు కూర్చోవడానికి సరిపడా బెంచీలు లేకపోవడానికి తోడు ఉన్న బెంచీలు కూడా ధ్వంసం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్రజ్యోతి చర్చావేదికలో లక్ష్మీనారాయణనగర్‌కు చెందిన పలువురు జీవీఎంసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కార చర్యలు చేపట్టడం లేదు.

స్కేటింగ్ కోర్టులోని క్రీడాకారులకు, కుటుంబ సభ్యులకు సౌకర్యాలు కల్పించకపోవడం విమర్శలు తావిస్తోంది. ఈ కోర్టు ప్రారంభం సమయంలో ఆవరణ చుట్టూ కూర్చోవడానికి సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఆకతాయిల పనో, లేక మరెవరు ఏం ఎవరు చేశారో తెలియదుగాని చాలా సిమెంట్ బెంచీలు ధ్వంసమయ్యాయి. దీంతో స్కేటింగ్‌కు వచ్చిన చిన్నారులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూర్చోవడానికి అవకాశం లేకపోతోంది. ఇక స్కేటింగ్ కోర్టుకు ఆనుకొని ఉన్న ఇనుప గొట్టాలపై చేతులు పెట్టి నిలబడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అలాగే చిన్నారులకు వినోదం కరువవుతోంది. అంతేకాకుండా ఈ కోర్టులోకి ప్రవేశ మార్గంలో ఉండాల్సిన రౌండ్ సర్కిల్ ఇనుపగేటు మూలకు చేరింది. గేటు దిగువ భాగం దెబ్బతిన్న కారణంగా ఆ గేటు పక్కనే ఉన్నా పార్కు ఆవరణలో మూలకు చేరింది. ఈ స్కేటింగ్ కోర్టును జీవీఎంసీ అధికారులు పర్యవేక్షించకపోవడం, వాచ్‌మెన్ లేకపోవడంతో చీకటి పడితే అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ఏదేమైనా ఓ చర్చా వేదికలో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యను కూడా రెండు నెలలైనా పరిష్కరించకపోవడంతో పట్టణ ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి స్కేటింగ్ కోర్టు పరిసరాలను తక్షణమే మెరుగుపర్చాలని, కనీస సదుపాయాలు కల్పించాలని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని చిన్నారుల తల్లిదండ్రులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పారిశుధ్యం నిర్వహణపై రగడ

మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల నిలదీత

వైసీపీ, కూటమి ఎంపీటీసీ సభ్యుల మధ్య వాగ్వాదం



సర్వసభ్య సమావేశంలో నాయకుల మధ్య వాగ్వాదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

తుమ్మపాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ తీరుపై అధికారులపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. పారిశుధ్య కార్మికులపై అధికారులు కర్కశంగా వ్యవహరిస్తుండడంతోనే సమస్య పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇటీవల తుమ్మపాల పంచాయతీలో పారిశుధ్య పనులకు సంబంధించి కాంట్రాక్టు వేలం పాటలో కూటమి నాయకులు తమకు అనుకూలంగా మలుచుకొని కాంట్రాక్టును దక్కించుకున్నారని ఎంపీటీసీ సభ్యుడు పంచదార్ల కన్నారావు ఆరోపించారు. దీనికి సమాధానం చెప్పాల్సిందిగా పట్టుబట్టారు. అదే పంచాయతీకి సంబంధించిన ఎంపీటీసీ సభ్యుడు చదరం నాగేశ్వరరావు మాట్లాడుతూ పారిశుధ్య పనులపై రాజకీయం చేస్తే ఊరుకునేది లేదన్నారు. వైసీపీ పాలనలో నాయకులంతా పారిశుధ్య కార్మికుల సొమ్మును ఇష్టానుసారంగా దోచుకు తినేశారని ఆరోపించారు. కేవలం తుమ్మపాల పంచాయతీ పరిధిలో ఏడాదికి రూ.38 లక్షలు పారిశుధ్య పనుల కోసం ఖర్చు చేస్తున్నా ఏమాత్రం సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. పారిశుధ్య కార్మికులకు కాంట్రాక్టు దక్కించుకున్న వైసీపీ నాయకులు అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి పారిశుధ్య కార్మికుల కుటుంబాలను సర్వనాశనం చేశారన్నారు. జడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి మాట్లాడుతూ కొత్తూరు పంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్మికుల జీతాల్లో ఇష్టానుసారంగా అధికారులు కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. బవులవాడ పంచాయతీ పరిధిలో బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శికి అధికారిక బాధ్యతలు అప్పగించకపోవడంతో ఏడాదిగా ఇంటి పన్నులు వసూలు చేసేందుకు అవకాశం లేక ఆదాయాన్ని నష్టపోతున్నామని చెప్పారు. తక్షణమే పంచాయతీ కార్యదర్శికి పర్మినెంట్ బాధ్యతలు అప్పగించాలన్నారు. అలాగే వెంకుపాలెం, సత్యనారాయణపురం, తుమ్మపాల ఎంపీటీసీలతో పాటు పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు రెవెన్యూ సిబ్బంది తీరుపై మండిపడ్డారు. దీనికి సంబంధించి డిప్యూటీ తహసీల్దార్‌ను నిలదీశారు. రీ సర్వే పేరిట రెవెన్యూ సిబ్బందిని గ్రామాల్లో ఉండకుండా ఆదేశాలు జారీ చేయడంతో గ్రామాల్లో అవసరమైన పనులకు వీఆర్వోలు ఉండటం లేదన్నారు. తాగునీటి సమస్య లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చొరవ చూపాలని కోరారు.

అనంతరం ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న గ్రాంట్లుతో శతశాతం సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, వైస్ ఎంపీపీలు అయితా ఆనందరాము, విల్లూరి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

34 శాతం రిజర్వేషన్ పునరుద్ధరించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు



సమావేశంలో మాట్లాడుతున్న లాకా వెంగళరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ పునరుద్ధరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లాకా వెంగళరావు కోరారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఓ హోటల్‌లో మంగళవారం జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రక్షణ చట్టాన్ని తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. మహిళల కోటాలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో 65 శాతానికి పైగా ఉన్న బీసీలు చట్టసభల్లో చాలా తక్కువ మంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కులగణన సంపూర్ణంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా మొల్లి సన్నిబాబును రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు ఈ సందర్భంగా నియమించి నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బోయిన భానుమూర్తి యాదవ్, కిల్లాడ అప్పలరాజు, రాష్ట్ర కార్యదర్శి బంధం పైడిరాజు, సంఘ నాయకులు జి. అప్పారావు, రెడ్డి రాము, చల్లా నానాజీ, దాలిబోయిన గోవింద్, బాల మురళీ, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మతల్లి అనుపోత్సవం



ఆదిరెడ్డిపాలెంలో పూజలు అందుకుంటున్న పరదేశమ్మతల్లి

సబ్బవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెం ప్రజల ఆరాధ్యదైవం పరదేశమ్మతల్లి అనుపోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని దూప, దీప నైవేద్యాలతో విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం కోలాటం, సాముగరిడీలు, తప్పెటగుళ్ల, బాణసంచా కాల్పులతో అమ్మవారి ఊరేగింపు, అనంతరం అనుపోత్సవం జరిగింది. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా బోయమాంబ పండుగ

పరవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పి.బోనంగి పంచాయతీలోని వీఎల్ఎస్.పురం గ్రామంలో మంగళవారం బోయమాంబ పండుగ వైభవంగా జరిగింది. తెల్లవారు నాలుగు గంటల నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ బండారు కల్పన, మాజీ సర్పంచ్ ఆర్.దేముడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు డెక్క శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామ పుర వీధుల్లో ఊరేగించి అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు. రాత్రి ఏడు గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

పెదముషిడివాడలో పైడిమాంబ జాతర

లంకెలపాలెం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెదముషిడివాడలో పైడిమాంబ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలను సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించి అనంతరం ఆలయం వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గుర్రపు స్వారీ ప్రదర్శన పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి.

20 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లాలంకొత్తూరు గ్రామంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. కె.సత్యనారాయణ సంచిలో 20 మద్యం సీసాలు లభ్యమయ్యాయని చెప్పారు. ఈ మేరకు ఆయనను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం సబ్ స్టేషన్ పరిధిలో 33/11కేవి, నర్సింగబిల్లి సబ్‌స్టేషన్ 11కేవి ఫీడర్ పనులు కారణంగా బుధవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నర్సింగబిల్లి, జె.తుని, ఎన్.జి.పాలెం, త్రిపురవానిపాలెం, అచ్యుతపురం, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమ్మాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చెయ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్‌పేట, గొబ్బూరు, నరసాపురం, సోమవరం, ఏనుగుతుని, చిన్న ఏనుగుతుని, జి.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాలకు అంతరాయం వాటిల్లుతుందని ఆయన తెలిపారు. ఆయా గ్రామాల్లో వినియోగదారులంతా తమకు సహకరించాలని కోరారు.

గ్రావెల్ లారీ పట్టివేత

కశింకోట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎస్ పేట గ్రామంలో మంగళవారం రాత్రి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని పట్టుకున్నామని సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఎటువంటి బిల్లులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నారని నిర్ధారణ కావడంతో తహసీల్దార్‌కు అప్పగించామని చెప్పారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



చిన్నారుల నృత్య ప్రదర్శనలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నూకాంబిక అమ్మవారి జాతరలో భాగంగా మంగళవారం ఎన్టీఆర్ స్టేడియంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథి కడిమిశెట్టి అచ్యుత రామయ్య, టీడీపీ నేత బొద్దపు ప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు పెతకంశెట్టి సీతారాం, మద్దాల రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గాజువాకకు చెందిన కళారాధన మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ, విశాఖకు చెందిన కావ్యాంజలి నృత్య కళాక్షేత్ర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కళాకారులు చేసిన కూచిపూడి, భరతనాట్యం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన



రింగు రోడ్డులో డెమో ఇస్తున్న సిబ్బంది

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అగ్నిమాపక శాఖ అధికారులు అగ్ని ప్రమాదాలు, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వేల్పులవీధిలోని కార్యాలయం నుంచి అధికారులు, సిబ్బంది రైల్వేస్టేషన్, రింగురోడ్డు మీదుగా మెయిన్‌రోడ్డు వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ ప్రమాదాల నివారణలో భాగంగా తీసుకుంటున్న చర్యలు ఏ విధంగా ఉంటాయో డెమో నిర్వహించారు. అనంతరం అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ప్రమాదాలు సంభవించినప్పుడు చేపట్టే నివారణ చర్యలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

ఫార్మాసిటీలో అగ్నిమాపక వారోత్సవాలు

పరవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీలోని ఎంఏఎస్ఆర్ఎం భవనం వద్ద మంగళవారం జేఎన్‌పీసీ మ్యాన్ ఫ్యాక్చరింగ్ అసోసియేషన్, మ్యూచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. ఏడీఎఫ్‌వో నాగేశ్వరరావు ఈ వేడుకలను ప్రారంభించారు. అగ్ని ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. వారోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రదర్శించిన అగ్నిమాపక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు, ఫార్మా పరిశ్రమల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం

సబ్బవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖాధికారి జీవీ సత్యరాజ్ సూచించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడు రోడ్ల కూడలిలో మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు శకటం నీటి ద్వారా మంటలను అదుపుచేసే విన్యాసాలను చేసి చూపించారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైరాఫీసర్ కె.అప్పలనాయుడు, సిబ్బంది ఎం.శ్యామ్‌కుమార్, వి.ద్వారకాద్రి, సీహెచ్.బెన్హర్, ఎం.శివ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిని కమ్మేసిన మేఘాలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని మంగళవారం మబ్బులు కమ్మేశాయి. ఉదయం నుంచి 34.3 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉన్న వాతావరణం, మూడు గంటల తర్వాత ఒక్కసారిగా చల్లబడింది. రహదారులన్నీ తడిసి ముద్దయ్యాలా చినుకులు పడటం చిరుజల్లులు కురవడం వల్ల రోడ్లపై జనాల రాకపోకలు సన్నగిల్లాయి.

సబ్బవరంలో వర్షంతో ప్రజలకు ఊరట

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కురిసిన మోస్తరు వర్షం ప్రజలకు ఊరటనిచ్చింది. మధ్యాహ్నం 3 గంటలకు వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అనంతరం కురిసిన వర్షంతో కొన్ని రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు.



దిబ్బపాలెంలో పంట కోత ప్రయోగాలు వివరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడి

» జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు

తుమ్మపాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు పేర్కొన్నారు. నువ్వు పంటలో క్షేత్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం దిబ్బపాలెంలో రైతులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నువ్వు పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులను కచ్చితంగా పాటించాలన్నారు. తొలకరి కాలంలో అన్ని రకాల ధాన్యాలు , పప్పుగింజలు, నూనె గింజలు కలిపి రైతులు చల్లుకోవాలని, తద్వారా నేలకు పోషకాలు అందుతాయని చెప్పారు. దిబ్బపాలెం, వెంకుపాలెం గ్రామాలను నూనె గింజ పంటల ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసినట్టు ఆయన చెప్పారు. ఈ గ్రామాల్లో 152 మంది రైతులకు నువ్వు గింజలు అందజేశామని చెప్పారు. అలాగే పంట కోత ప్రయోగాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజా, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి తులసీమణి, రైతులు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం

» ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ అనంతలక్ష్మి



సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి

కొత్తూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పలు వ్యాయామాలు చేయడంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి అన్నారు. అనకాపల్లి పట్టణంలోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ హాలులో మంగళవారం జిల్లా స్థాయి పోషణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే పౌష్టికాహారం విషయమై అవగాహన కల్పించారు. అలాగే బిడ్డకు తల్లిపాలు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అంతకు ముందు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు పిండి వంటల ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం, అనకాపల్లి సీడీపీవోలు వి.లలితకుమారి, ప్రభావతి, ఎస్ఐ పి.రాములమ్మ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి చంద్రదేవ్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగశిరీష, సూపరింటెండెంట్ పద్మకళ, సీనియర్ అసిస్టెంట్ మోహద్దీన్, జిల్లా కోఆర్డినేటర్ వై.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి రాజులమ్మకు అవార్డు బహూకరణ



రాజులమ్మకు లాప్‌టాప్ అందజేస్తున్న విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్

కశింకోట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేగాడ కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో 983 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన కె.రాజులమ్మకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అవార్డు అందజేశారు. విజయవాడలో మంగళవారం ఈ అవార్డును బహూకరించారు. అలాగే మెడల్, శాలువాతో రాజులమ్మను సత్కరించి లాప్‌టాప్‌ను అందించినట్టు ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు.

గొర్లివానిపాలెం పంచాయతీకి ట్రాక్టర్ వితరణ



ట్రాక్టర్ పత్రాలు అందిస్తున్న లారస్ సీఈవో

పరవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్స్ యాజమాన్యం గొర్లివానిపాలెం పంచాయతీకి ట్రాక్టర్‌ను సమకూర్చింది. మంగళవారం లారస్ ల్యాబ్స్ సీఈవో చావా సత్యనారాయణ ట్రాక్టర్‌కు సంబంధించిన పత్రాలను సర్పంచ్ గోపికి అందజేశారు. పంచాయతీలో పారిశుధ్య పనుల నిర్వహణకు ఈ ట్రాక్టర్‌ను వినియోగించుకోవాలని సీఈవో సూచించారు. కార్యక్రమంలో లారస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చావా నరసింహరావు, ఉప సర్పంచ్ గొర్లి రామారావు, పంచాయతీ కార్యదర్శి తరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల తనిఖీ



మందుగుండు సామగ్రి నిర్వాహకులతో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో బాణసంచా తయారీ కేంద్రాలను రెవెన్యూ, జీవీఎంసీ, అగ్నిమాపక, పోలీసు శాఖల అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. జాతీయ రహదారిలోని నూకాంబిక ముఖ ద్వారం వద్ద మందుగుండు తయారీ కేంద్రం, కొప్పాక, తోటాడ మార్గంలోని మందుగుండు నిల్వ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో పలు లోపాలు ఉన్నట్టు గుర్తించారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. తహసీల్దార్ కె.విజయ్‌కుమార్, జీవీఎంసీ ఫైర్ ఆఫీసర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సబ్బవరంలో...



గుల్లేపల్లిలో తనిఖీలు చేస్తున్న అధికారులు

సబ్బవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా బాణసంచా తయారీ చేస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ హెచ్చరించారు. మండలంలోని అంతకాపల్లి, గుల్లేపల్లి, మలునాయుడుపాలెం, గంగవరం గ్రామాల్లో బాణసంచా తయారీ కేంద్రాలను సీఐ పిన్నంటి రమణ, ఫైరాఫీసర్ సత్యకుమార్‌తో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. బాణసంచా కేంద్రాల యజమానులు దాసరి పెంటయ్య, దాసరి అంకుల్, దాసరి దేముడు తదితరులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనుమతులు లేకుండా తయారు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ వీరయ్య, వీఆర్వోలు రుక్మిణి, ముత్యాలనాయుడు, భూషణం, బెన్హర్ పాల్గొన్నారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంలో అర్జీల స్వీకరణలో జిల్లా నేతలు



టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కార్పొరేషన్ల చైర్మన్లు పీవీజీ కుమార్, మళ్ల సురేంద్ర

అనకాపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం గుంటూరు జిల్లా మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లాకు చెందిన రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. వీటిని పరిష్కారం నిమిత్తం ఆయా జిల్లాల అధికారులకు పంపనున్నారు.

ప్రమాదకరంగా తుఫాన్ భవనం

- శిథిలస్థితికి చేరడంతో ఎప్పుడు కూలిపోతుందోనని మత్స్యకారులు ఆందోళన



కొత్తపట్నంలో శిథిలమైన తుఫాన్ రక్షిత భవనం

రాంబిల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మత్స్యకార గ్రామమైన కొత్తపట్నం లో తుఫాన్ రక్షిత భవనం శిథిలమై ప్రమాదకరంగా తయారైంది. ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఈ భవనం చుట్టూ పలు నివాసాలు వున్నాయి. తుఫాన్ రక్షిత భవనం పెచ్చులు ఊడిపోవడంతోపాటు, సన్‌షేడ్‌లు ఊడిపోయి ఇళ్ల మీద పడుతున్నాయి. వర్షా కాలంలో మరింత ప్రమాదకరంగా మారుతున్నదని, గోడల పెచ్చులు ఊడిపోయి నివాసాలపైన పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. భవనానికి మరమ్మతులు చేయించాలని లేదంటే కూల్చివేయాలని పలుమార్లు అధికారులకు విజ్ఞప్తిచేసినా పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరగకుముందే తుఫాన్ రక్షిత భవనాన్ని తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పరిశ్రమల స్థాపనకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, హాజరైన అధికారులు

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ జిల్లాస్థాయి సమావేశం మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు సింగిల్ విండో విధానం కింద వివిధ శాఖల అనుమతుల కోసం 2,177 దరఖాస్తులు రాగా వాటిలో 2077 దరఖాస్తులను ఆమోదించామన్నారు. మిగిలిన దరఖాస్తులను కూడా వీలైనంత త్వరగా క్లియర్ చేయాలని ఆమె ఆదేశించారు. జిల్లాలో 41 పరిశ్రమలకు సంబంధించి వివిధ రాయితీల కోసం 121 దరఖాస్తులురాగా రూ.12.91 కోట్లకు కమిటీలో ఆమోదం తెలపామన్నారు. సమావేశంలో ఆర్డీవో షేక్ ఆయిషా, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో పశు సంరక్షణ అవసరం

- ఈ కాలంలో పశువులకు తగ్గనున్న వ్యాధి నిరోధక శక్తి
- పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- పశువైద్య శాస్త్రవేత్తల సూచన

అధిక ఉష్ణోగ్రతలతో ఆరోగ్య సమస్యలు



గాలి, వెలుతురు తగిలే షెడ్‌లో గేదెలు (ఫైల్ ఫొటో)

చింతపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులు, మేకలు, గొర్రెలు పలు రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటాయి. సహజంగా 18 నుంచి 35 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత పశువులకు సౌకర్యంగానే వుంటుంది. ఆపై అధిక ఉష్ణోగ్రత నమోదైతే పశువులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటాయి. వడదెబ్బ కారణంగా పశువులు మృతి చెందే అవకాశముంది. వేసవిలో పాడి రైతులు పశువుల సంరక్షణకు మెలకువలు పాటించాలి.



మేకలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది (ఫైల్ ఫొటో)

వేసవిలో పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. ఈ కాలంలో పశువులకు కావాల్సినంత మేత దొరకదు. ఈ మేరకు శరీరానికి కావాల్సిన పోషకాలు, ఖనిజ లవణాలు, విటమిన్లు అందక వ్యాధి నిరోధకశక్తి తగ్గుతుంది. దీని వల్ల అవి పలు రకాల సమస్యలను ఎదుర్కొంటాయి.

వేసవిలో వచ్చే వ్యాధులు

పశువుల్లో పోషకాహార లోపం కారణంగా వ్యాధి నిరోధక శక్తి తగ్గి గొంతువాపు, గాలికుంటు, జబ్బవాపు వ్యాధులు వచ్చే అవకాశముంది. దీంతో పాటు కలుషితమైన నీరు తాగడం, పశువులను కడగడం వల్ల అంతర, బాహ్యపరాన్నజీవుల సమస్యలు అధికమవుతాయి. ఈ వ్యాధులు రాకుండా పాడి రైతులు వేసవి ప్రారంభంలోనే ప్రతి పశువుకు టీకాలు వేయించాలి. వీటి నివారణకు నట్టల మందులు వేయించాలి. సాధారణంగా వేసవిలో జీర్ణక్రియ సమస్యలు పశువుల్లో అధికంగా కనిపిస్తాయి. పశువుకు కావాల్సినంత మేత లభించకపోవడం, వేడి కారణంగా తక్కువ ఆహారం తీసుకోవడం, పరిశుభ్రమైన నీరు తాగకపోవడం వల్ల మలబద్ధకం, పారుడు రోగాలు వస్తాయి.

ప్రత్యుత్పత్తి సమస్య

అధిక ఉష్ణోగ్రత కారణంగా పశువులు ఎదకు రాకుండా పోతాయి. హార్మోన్ల ఉత్పత్తి తగ్గడం వల్ల పశువులలో అండాలు సరిగ్గా ఉత్పత్తికావు. శరీరంలో గ్లూకోజ్ పరిమాణం తగ్గడం వలన అండాశయాల్లో స్తబ్ధత, అండోత్పత్తి వ్యత్యాసాలు సంభవించి పశువులు తిరిగి పొర్లుతుంటాయి. పశువులు ఎండుగడ్డి ఎక్కువగా తినడం వలన విటమిన్ ఏ, కాపర్, మెగ్నీషియం, ఖనిజ లవణాల లోపం ఏర్పడి తాత్కాలిక వంధత్వం కలుగుతుంది. వేసవిలో పశువులు నీరు ఎక్కువగా తాగి మేత తక్కువగా తింటాయి. ఈ కారణంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. ఈ సమస్య వల్ల వేసవిలో మనదేశంలో పాల కొరత ఏర్పడుతుంది. ఈసమస్యను అధిగమించేందుకు పశువులకు అవసరమైన ఆహారాన్ని అందించాలి. వాటిని మేత కోసం పొలాలు/ అడవుల్లోకి తీసుకువెళ్తారు. పశువులు ఎక్కువ సమయం ఎండలో వుండడం, తాగునీరు పూర్తి స్థాయిలో లభించకపోవడం వల్ల వడదెబ్బకు గురవుతాయి. కొన్ని సందర్భాల్లో అపస్మారక స్థితికి చేరుకుని చనిపోయే ప్రమాదముంది. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వడదెబ్బ తగిలిందని గుర్తించాలి. వెంటనే చల్లని ప్రదేశానికిగాని, షెడ్‌లోకిగాని తీసుకు వెళ్లాలి. వాటిని చల్లటి, శుభ్రమైన నీటితో కడగాలి. పశువు తాగినంత నీరు ఇవ్వాలి. ప్రథమ చికిత్స కూడా అందించాలి. ప్రధానంగా ఉదయం 6 గంటల నుంచి 11 గంటలు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్య కాలంలోనే పశువులను మేత కోసం బయటకు తీసుకువెళ్లాలి. మిగిలిన సమయంలో పాకలో కట్టేసి మేపడం చాలా మంచిది. వేసవిలో అధిక వేడి నుంచి పశువులను కాపాడుకోవడానికి మంచి వసతి ఏర్పాటు చేసుకోవాలి. పశువుల పాక ఎత్తుగా, నీరు నిల్వ ప్రదేశంలో గాలి, వెలుతురు బాగా ప్రసరించే విధంగా నిర్మించుకోవాలి. సూర్యరశ్మి నేరుగా షెడ్‌లోకి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



పశువులు వేసవిలో తక్కువ మేత తీసుకొని ఎక్కువ నీరు తాగుతాయి. తాగేనీరు పుష్కలంగా, పరిశుభ్రంగా వుండేలా చూసుకోవాలి. నీరు అన్ని వేళలా పశువులకు అందుబాటులో వుంచాలి. ఆహారం విషయంలో జాగ్ర త్తలు తీసుకోవాలి. పగటిపూట పచ్చగడ్డి, దాణా మిశ్రమాన్ని ఇచ్చి రాత్రి ఎండుగడ్డిని మేపాలి. పగటి పూట ఎండుగడ్డి మేపితే పశువులు నీరు ఎక్కువగా తీసుకుని మేత తక్కువగా తింటాయి.

- డాక్టర్ విజయ రాజ్ఞి,
పశువైద్య శాస్త్రవేత్త, కేవీకే, హరిపురం

కిరాతకం

- భార్యను, కడుపులో ఉన్న బిడ్డను చంపేసి, పక్కనున్న కుర్చీలో కూర్చుని సెల్ ఫోన్‌తో కాలక్షేపం
- నిండు గర్భిణి హత్య కేసులో నివ్వెరపరచిన నిందితుడి వ్యవహారం



కేజీహెచ్ మార్చురీ వద్ద విలపిస్తున్న అనూష తల్లి, చెల్లెలు

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నిండు గర్భిణి అనూష (27) హత్య ఉదంతం కలకలం రేపింది. మంగళవారం కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. అక్కడకు వచ్చిన కుటుంబ సభ్యులు, స్నేహితులు గుండెలు అవిసేలా రోదించారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న పాపానికి భూమిపైనే లేకుండా చేశాడంటూ వాపోయారు. ఆమెను వదిలించుకునేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో ప్రాణాలు తీసేందుకు తెగించాడన్నారు. అతడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వారు చెప్పిన వివరాల ప్రకారం...

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలానికి చెందిన అనూష నగరంలోని ఒక కాలేజీలో హోటల్ మేనేజ్‌మెంట్ చేసింది. ఆ సమయంలో స్నేహితుల ద్వారా జ్ఞానేశ్వర్ పరిచమయ్యాడు. స్నేహం కాస్త ప్రేమగా మారింది. వివాహానికి ఆమె కుటుంబ సభ్యులు అంగీకరించారు. కానీ, జ్ఞానేశ్వర్ మాత్రం తమ కుటుంబ సభ్యుల అంగీకరించరని, పెళ్లి తరువాత చెబుదామని అనూషను ఒప్పించాడు. 2022 డిసెంబరు పదో తేదీన సింహాచలంలో అనూష కుటుంబ సభ్యులు, కొద్దిమంది స్నేహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. వివాహమైన తరువాత ఎనిమిది నెలలపాటు ఇద్దరూ బాగానే ఉన్నారు. ఆ తరువాత నుంచి జ్ఞానేశ్వర్ అసలు రంగు బయటపడుతూ వచ్చింది. పెళ్లి జరిగిన సుమారు ఏడాదికి తనకు బ్లడ్ కేన్సర్ ఉందని అనూషకు చెప్పాడు. తాను ఎక్కువ కాలం జీవించనని, తనను విడిచి వెళ్లిపోవాలని, నీ జీవితం నాశనం కాకూడదని అన్నాడు. అలా వదిలి వెళ్లబోనని, ఉన్నంత కాలం నీతోనే ఉంటానంటూ అనూష చెప్పినా...అతడు తన ప్రయత్నాలను ఆపలేదు. రక్తపు వాంతులు చేసుకున్నట్టు, తీవ్రమైన నీరసంతో బాధపడుతున్నట్టు నమ్మించే ప్రయత్నం చేశాడు. వైద్యం కోసమంటూ అనూష వద్ద ఉన్న డబ్బులు తీసుకున్నాడు. ఆ తరువాత అనారోగ్య సమస్యను పక్కనపెట్టి తన కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదని, నిన్ను చంపేస్తారంటూ అనూషను భయపెట్టడం మొదలుపెట్టాడు. ఇప్పటికైనా నీదారి నువ్వు చూసుకోవాలంటూ అనూషను వదిలించుకునే ప్రయత్నం చేశాడు. కానీ, అనూష 'నాకు సర్వం నువ్వే. ప్రాణాలు పోయినా నిన్ను వదిలి వెళ్లను' అని చెప్పింది. ఈ క్రమంలోనే అనూష గర్భం దాల్చింది. కొద్దిరోజులు అనూషను బాగానే చూసుకున్నట్టు నటించాడు. నాలుగు రోజుల కిందట ఫలూదా తీసుకువచ్చి అనూషకు ఇచ్చాడు. తాగే క్రమంలో ఒక టాబ్లెట్ బయటకు రావడంతో ఒక్కసారిగా అనూష షాక్ తింది. టాబ్లెట్ ఉన్న విషయాన్ని జ్ఞానేశ్వర్‌కు చెప్పి షాపునకు వెళ్లి నిలదీద్దామన్నది. దానికి సరేనన్న జ్ఞానేశ్వర్ టాబ్లెట్ పక్కన పెట్టాలని సూచించి బయటకు వెళ్లిపోయాడు. ఇదే విషయాన్ని అనూష కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా చెప్పింది. అప్పుడు కూడా జ్ఞానేశ్వర్‌పై అనుమానం రాలేదు. ప్రసవానికి సమయం దగ్గరపడడంతో ఆదివారం సాయంత్రం డాక్టర్ వద్దకు వెళ్లారు. ఆస్పత్రిలో చేరాలని వైద్యురాలు సూచించారు. అయితే, ఆదివారం ఎందుకు, సోమవారం చేరుదామని చెప్పి అనూషను ఇంటికి తీసుకువెళ్లాడు. అదేరోజు ఉదయం అనూష అమ్మమ్మ తుమ్మలపల్లి అన్నవరం కాకినాడ నుంచి వచ్చారు. రాత్రి ఆస్పత్రి నుంచి వచ్చిన ఇద్దరికీ అన్నం పెట్టింది. ఇద్దరూ రూమ్‌లోకి వెళ్లారు. అనూష అమ్మమ్మ హాల్‌లో పడుకుంది. సోమవారం ఉదయం సుమారు ఆరు గంటల సమయంలో వాళ్లున్న గదిలోకి అనూష అమ్మమ్మ వెళ్లింది. అప్పటికీ నిద్రలో ఉన్నట్టు కనిపించిన అనూషను తట్టి లేపే ప్రయత్నం చేసింది. ఎంతసేపటికీ లేవకపోవడంతో పక్కనే కుర్చీలో కూర్చుని సెల్‌ఫోన్ చూసుకుంటున్న జ్ఞానేశ్వర్‌తో అమ్మాయి లేవడం లేదు...చూడాలని చెప్పింది. ఏమీ తెలియనట్టు చెంపలపై కొడుతూ లే అనూష...అంటూ నాటకాలాడే ప్రయత్నం చేశాడు. అనూష లేవడం లేదని, ఏమైందో తెలియడం లేదంటూ అనూష అమ్మమ్మకు చెప్పాడు. వెంటనే అప్రమత్తమైన ఆమె ఎదురింటి వాళ్లను పిలిచింది. అనూష స్నేహితులకు జ్ఞానేశ్వర్ విషయాన్ని తెలియజేయడంతో వారంతా ఇంటికి చేరుకున్నారు. తొలుత దగ్గరలోని రెండు ఆస్పత్రులకు కారులో తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో కేర్‌కు తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు చనిపోయిందని నిర్ధారించారు. అనూష తనను విడిచి వెళ్లిపోయిందని, తాను ఎలా బతకాలంటూ జ్ఞానేశ్వర్ నాటకాన్ని రక్తికట్టించే ప్రయత్నం చేశాడు.

గాయాలతో అనుమానం

కేర్ నుంచి అనూషను ఇంటికి తీసుకువెళ్లిపోయేందుకు జ్ఞానేశ్వర్ ప్రయత్నించాడు. అయితే జ్ఞానేశ్వర్ ముఖం, చేతిపై గాయాలు ఉండడాన్ని గుర్తించిన అనూష స్నేహితుడు ఆదర్శ్‌కు అనుమానం వచ్చింది. తన తల్లిని కేర్ ఆస్పత్రికి రమ్మని చెప్పాడు. ఆమె కేజీహెచ్‌లో పనిచేస్తున్నారు. మెడపై కొన్ని మచ్చలు ఉండడం, శరీరం పూర్తిగా నల్లగా మారిపోవడంతో కేజీహెచ్‌కు తీసుకు వెళదామని ఆమె చెప్పారు. దానికి జ్ఞానేశ్వర్ వద్దంటూ వారించే ప్రయత్నం చేశాడు. కానీ, అంతా తీసుకు వెళ్లాల్సిందేనని పట్టు బట్టడంతో వారితోపాటు అంబులెన్స్‌లో ఎక్కి కేజీహెచ్‌కు వెళ్లాడు. అక్కడి వైద్యులు కూడా చనిపోయిందని నిర్ధారించడంతో కుటుంబ సభ్యులతోపాటు స్నేహితులు గట్టిగా అడగడంతో తొలుత తానే చంపేశానని చెప్పాడు. ఆ తరువాత ఉరి వేసుకుందని చెప్పాడు. మళ్లీ గట్టిగా అడగడంతో తనకు ఇష్టం లేదని అందుకు చంపేసినట్టు అంగీకరించాడు. అమ్మాయికి పెళ్లి జరిగినప్పుడు తనకు ఆరోగ్యం బాలేదని, కోమాలో ఉన్నానని, ఇప్పుడు తన బిడ్డను పూర్తిగా దూరం చేశాడని ఆమె తల్లి పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. బిడ్డకు ప్రసవం సమయంలో తోడుగా ఉండాలని వచ్చానని, తాను ఇంట్లో ఉండగానే బిడ్డ ప్రాణాలు తీసేశాడని అనూష అమ్మమ్మ అన్నవరం విలపించారు.

అంత్యక్రియలు పూర్తి..

అనూష కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకు జ్ఞానేశ్వర్ కుటుంబ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం కేజీహెచ్ మార్చురీ వద్దకు వచ్చారు. వారి డిమాండ్ మేరకు అనూషను వారి స్వగ్రామమైన దువ్వాడ తీసుకువెళ్లి వారి కోడలిగా అంత్యక్రియలు నిర్వహించారు. పోయిన ప్రాణాన్ని తాము తీసుకురాలేకపోయినా వారి ఇంటి కోడలిగా గుర్తింపు తెచ్చుకోవాలని భావించిన అనూషకు అక్కడే అంత్యక్రియలు నిర్వహించడం ద్వారా ఆత్మశాంతి కలిగించే ప్రయత్నం చేశామని అనూష మరిది స్వరూప్ తెలిపారు. ఇకపోతే, అనూష గర్భంలో ఆడ బిడ్డ ఉన్నట్టు పోస్టుమార్టం సమయంలో తేలింది.

అసంపూర్తి ఇళ్లకు ఆర్థిక సాయం

... 5వ పేజీ తరువాయి

రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షలకుపైగా లబ్ధిదారులకు రూ.3,219 కోట్లు చెల్లిస్తున్నట్టు తాతయ్యబాబు వెల్లడించారు. కాగా కొత్త ఇంటి స్థలాలు, పక్కా ఇళ్ల మంజూరు కోసం రాష్ట్రంలో 7 లక్షల 10 వేల 294 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరందరికీ దశలవారీగా స్థలం, పక్కా ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిదన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో రాష్ట్రానికి నాలుగు లక్షల ఇళ్లు మంజూరు చేసే అవకాశం ఉందని, అర్బన్ అబ్ధిదారులకు రూ.2.9 లక్షలు, రూరల్ లబ్ధిదారులకు రూ.2.3 లక్షల చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తాయన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు కూడా గృహ నిర్మాణ పథకం అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి పార్థసారథి యోచన చేస్తున్నారని తాతయ్యబాబు చెప్పారు. విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు దొండా నరేశ్, సిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

క్రైం... crime news

ఎలమంచిలిలో పట్టపగలు చైన్ స్నాచింగ్

- మహిళ మెడలో నుంచి మూడు తులాల బంగారం పుస్తెల తాడు అపహరణ



పుస్తెలతాడు తెంచుకుని ద్విచక్ర వాహనంపై పరారవుతున్న ఆగంతకులు



బాధితురాలు అరుణ

ఎలమంచిలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి (సీహెచ్‌సీ) వెళ్లే రోడ్డులో పట్టపగలు చైన్ స్నాచింగ్ జరిగింది. నడుచుకుంటూ వెళుతున్న ఒక మహిళ మెడలో నుంచి ఒక యువకుడు మూడు తులాల బంగారు పుస్తెల తాడును తెంచుకుని మరో యువకుడితో కలిసి ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. ఇందుకు సంబంధించి బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

పట్టణంలోని తులసీనగర్‌కు చెందిన పొలమరశెట్టి అరుణ ఆరోగ్య పరీక్షల నిమిత్తం మంగళవారం ఉదయం సమీపంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. తిరిగి 11 గంటల ప్రాంతంలో ఇంటికి నడుచుకుంటూ వస్తున్నది. ఈ సమయంలో ఆ వీధిలో జనసంచారం తక్కువగా వుంది. కొద్ది దూరం వెళ్లిన తరువాత వెనుక నుంచి వచ్చిన ఒక యువకుడు, అరుణ మెడలో వున్న బంగారు పుస్తెల తాడును లాగేశాడు. అప్పటికే అక్కడ ద్విచక్ర వాహనంపై వున్న మరో యువకుడితో కలిసి పరారయ్యాడు. దీంతో ఆమె బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చారు. పుస్తెల తాడు చోరీ గురించి వారికి చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ ఎస్ఐ సావిత్రి సిబ్బందితో వచ్చి వివరాలు సేకరించారు. భూలోకమాంబ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసి ఉన్న సీసీ కెమెరాలు పనిచేయడం లేదని తెలుసుకుని, ఇదే మార్గంలో టూ వీలర్ షోరూమ్‌లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు యువకులను అరుణ గుర్తించి, పుస్తెలతాడు చోరీ చేసింది వారేనని పోలీసులకు చెప్పింది. అనంతరం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది.

తహసీల్దార్‌ను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

గొలుగొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌ను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును పాకలపాడు గ్రామానికి చెందిన అల్లు వెంకటరమణ అసభ్య పదజాలంతో దూషించాడు. దీనిపై తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వెంకటరమణను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గంజాయి కేసులో మరో ఇద్దరి అరెస్టు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డు సమీపంలో జనవరి రెండో తేదీన పట్టుకున్న 110 కిలోల గంజాయి కేసుకు సంబంధించి మరో ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్టు నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. నక్కపల్లి పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, జనవరి రెండో తేదీన గంజాయితోపాటు రాజస్థాన్‌కు చెందిన రామ్‌లాల్ నాయక్, లోభచందు లోహర్‌లను అరెస్టు చేశామని చెప్పారు. అప్పట్లో వారు ఇచ్చిన సమాచారం మేరకు సువాన్ లాక్ సింగ్, కదం సింగ్‌లపైనా కేసు నమోదు చేసిన పోలీసులు అడ్డరోడ్డు జంక్షన్ సమీపంలో మంగళవారం పట్టుకొని అరెస్టు చేశారన్నారు. ఈ కేసుకు సంబంధించి గంజాయి సరఫరా చేసిన వారిని, కొనుగోలు చేస్తున్న వారిని పట్టుకోవాల్సి వుందని డీఎస్పీ చెప్పారు. సమావేశంలో సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు.

15 లీటర్ల సారా స్వాధీనం, నలుగురి అరెస్టు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదరాంభద్రపురంలో దాడులు నిర్వహించి ఇద్దరి నుంచి 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసు తెలిపారు. ఒక మహిళ నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుని, ఈమెతోపాటు సారా సరఫరా చేసిన ఈదటం గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. మరోచోట ఇంకో మహిళను అదుపులోకి తీసుకుని ఆమె నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని, ఈమెతోపాటు సారా సరఫరా చేసిన తుని వీరవరపుపేటకు చెందిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. నలుగురినీ అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు కె.మురళీమోహన్‌రావు, ఎల్‌వీ స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్లను దొంగిలిస్తున్న అనిమెల్లి కిశోర్‌కుమార్ అనే వ్యక్తిని మండలంలోని అరట్లకోట శివారులో అరెస్టుచేసి మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. ఈ వాహనాలు పాయకరావుపేట, ఎలమంచిలి, కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులకు చెందినవిగా గుర్తించామన్నారు. నిందితుడిని రిమాండ్‌కి తరలించినట్టు ఆయన చెప్పారు.

ఎనిమిది కిలోల గంజాయి స్వాధీనం

రావికమతం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రావికమతం పెట్రోల్ బంకు సమీపంలో మంగళవారం 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన మహిళతో పాటు మరొకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ రఘువర్మ తెలిపారు. తమిళనాడుకు చెందిన వరుసకు అన్నా, చెల్లెలు మురుగన్, తంగంలు గంజాయిని ఏజెన్సీ ప్రాంతంలో కొనుగోలు చేసి రెండు లగేజీ బ్యాగుల్లో తరలిస్తుండగా పట్టుకున్నట్టు ఆయన తెలిపారు.

'వాట్సాప్ గవర్నెన్స్‌తో సులభంగా ప్రభుత్వ సేవలు'

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనమిత్ర - ప్రజల చేతిలో ప్రభుత్వం (వాట్సాప్ గవర్నెన్స్) కరపత్రాన్ని కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభతరంగా అందించడమే వాట్సాప్ గవర్నెన్స్ లక్ష్యమన్నారు. 95523 00009 నంబరును 'మనమిత్ర' పేరుతో నమోదు చేసుకొని 'హాయ్' అని సందేశం పంపడం ద్వారా వివిధ రకాల ప్రభుత్వ సేవలను పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల అధికారి మంజులావాణి, నర్సీపట్నం డీఎల్‌డీఓ ఉదయశ్రీ పాల్గొన్నారు.

కొత్త డీలర్లకు రేషన్ డిపోలు

... 5వ పేజీ తరువాయి

లీజుకు తీసుకున్న వాళ్లు ప్రతి నెలా అద్దెలు కడుతున్నారు. కానీ అధికారులు రేషన్ డిపోలను మాత్రం అప్పగించలేదు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు స్పందించి డిపోలు అప్పగించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అచ్యుతాపురం మండలంలో ఆరు డిపోలకుగాను ఐదు డిపోలను డీలర్లకు అప్పగించాలని ఆదేశాలు వచ్చాయి. ఒక డిపోనకు డీలర్ డబ్బులు కట్టకపోవడంతో ఆగిపోయింది. జిల్లాలో మిగిలిన డిపోలను కూడా కొత్త డీలర్లకు అప్పగించాల్సిందిగా ఆదేశాలు వచ్చాయి.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429